ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మే 24, 2009



39297

మళ్ళీ మన్మోహనీయం

హ్యాపీ బర్త్‌డే

(2009 మే 24 నుంచి
2009 మే 30 వరకు)

వి.వి.సూర్యతేజగుప్తా
2సం॥, మే-2007
లక్ష్మీప్రసన్న-బద్రి
జగ్గయ్యపేట-కృష్ణా

లక్కీగౌడ్
1సం॥, మే-2008
స్వాతి-శ్రీధర్‌గౌడ్
మేడ్చల్-రంగారెడ్డి

ఎ. షణ్ముఖప్రియ
2సం॥, మే-27
లక్ష్మీచైతన్య-రామకృష్ణారెడ్డి
మున్నంగి-గుంటూరు

శివలక్ష్మి
10సం॥, మే-1999
పి.రమ-రాజుబాబు
ఏలూరు-ప॥గో॥

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

గమనిక: పన్నెండు సంవత్సరాలలోపు పిల్లల
ఫొటోలు మాత్రమే ప్రచురించబడతాయి.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి
ప్లాట్ నెం. 21/1. ఎం.హెచ్ భవన్
అజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగం పల్లి.
హైదరాబాద్-500 020

మనలో మాట

పునఃప్రారంభం

వేసవి సెలవులకోసం ఎంతగా ఎదురుచూశారు! అలా వచ్చాయి. ఇలా వెళ్లిపోతున్నాయి. సెలవులన్నాళ్లు పిల్లలు, పెద్దలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. ఒత్తిడి, హడావిడికి దూరంగా సుదూరంగా ప్రశాంతంగా గడిపారు. ఎంచక్కా ఊళ్లకెళ్లారు. అమ్మమ్మలు, నానమ్మల చేతి వంట రుచి చూశారు. కథలు చెప్తే బుద్ధిగా ఊ కొట్టారు. కోతికొమ్మచ్చులు... ఒంగుడుదూకుళ్లు అంటూ అల్లరి చేశారు. పట్నపు పిల్లలు కొందరు మాత్రం సమ్మర్ క్యాంపులకే పరిమితమయ్యారు. సెలవుల్లో పిడుగుల గోల పెద్దలను కాస్త ఇబ్బంది పెట్టినా మనసులోనే మురుసుకున్నారు.

మళ్లీ స్కూళ్లు షురూ కానున్నాయి. ఇప్పుడు పిల్లలకు మరోరకం ఉత్కంఠ. కొత్త తరగతి, కొత్త పుస్తకాలు, కొత్త బ్యాగులు, కొత్త మిత్రులు...రాబోతున్నందుకు సంతోషమే. హోంవర్కులు, పుస్తకాల మోత, పరీక్షల జంఝాటం, ఉరుకులు పరుగులు గుర్తొస్తే మాత్రం విచారమే. అమ్మానాన్నలకూ ఒకింత దిగులే. వేలకు వేల రూపాయల ఫీజులను ఎలా సర్దుబాటు చేయాలా అని గుబులే. పిల్లలకు స్కూళ్లు-హోంవర్కుతో సరి. మగాళ్లకు ఆఫీసులు-ఫీజులతో సరి. ఆడాళ్లకో! 'దీంతో సరి' అనుకోడానికి లేదుకదా. తెల్లవారుజామునే మొదలౌతుంది టైమ్‌టేబుల్. పిల్లల టిఫిన్లు, క్యారేజీలు, హోంవర్కులు, స్నానాలు, భోజనాలతో అర్ధరాత్రికి కానీ ముగియదు. పెద్దగా మార్పులు చేర్పులు లేని టైమ్‌టేబుల్‌తో (ఆదివారాలు మినహా) ఉరుకులు పరుగులు మొదలు. పిల్లలు పైతరగతులకు వెళుతున్నారన్న ఒకేఒక్క ఆనందమే ఆ పరుగుపందెంలో గెలవడానికి సత్తానిస్తుందేమో. పిల్లలతో ఏ వయసులో వచ్చే సమస్యలు ఆ వయసులో వస్తూనే వుంటాయి. తొలిసారిగా స్కూల్లో చేర్పించేటప్పుడు 'వేలెడంత పిల్లాడికి వేలకువేల రూపాయల ఫీజులా?' అనిపిస్తుంది. తర్వాత్తర్వాత ఫీజుల మోత అలవాటైపోతుంది. పదవ తరగతిలో టార్గెట్ల మోజు పట్టుకుంటుంది. ఆ తర్వాత ఎంసెట్ క్రేజు బుర్రలో మకాం వేసుక్కూర్చుంటుంది. సీటు వస్తే సరి. లేకుంటే మళ్లీ లాంగ్ టరమ్ కోచింగ్‌లూ...పరీక్షలూ... జీవితం అంటేనే ప్రతిదశలో పునఃప్రారంభమేనేమో! ★

ఈ సంచికలో....

టపా	...	2
సీరియల్	...	6
బాల నేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	20
కూల్ కూల్‌గా	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

అనేక ప్రశ్నలకు సమాధానం

ఆరోగ్యం ... 8

తలనొప్పిని అర్థం చేసుకోవడమెలా?

విజ్ఞాన వీచిక ... 10

మండే ఎండలు కారణం మనమే

కథ ... 18

దిద్దుకోలేని తప్పు

సినిమా కబుర్లు ... 21

కనపడని రెక్కలతో...



'కథ చెప్తే ఊ... కొడతారా' ఆలోచింపచేసింది

మే 10వ తేదీ నాటి స్నేహలోని అట్టమీది కథగా 'కథ చెప్తే ఊ... కొడతారా' అంజనగారి రచన ఆలోచింప జేసింది. కథలు చెప్పడం, వినడం తద్వారా మానవ సంబంధాలు మెరుగవుతాయి. కప్పల పెళ్ళిళ్ళ, పక్షుల పాటలు... వంటి విషయ సరంజామాతో 'తెల్సా' అలరింప జేసింది. 'అమ్మా... ఓ నా మమ్మీ' ప్రకాష్ గారి కవిత్వం అంతగా అర్థం కాలేదు. పదాల విరుపులు కుదరలేదనిపించింది. చూద్దామా అలహాబాద్ విశేషాలు బాగున్నాయి. మామిడికాయ వంటకాలు చవులూరింప చేశాయి. ఆరోగ్యంలో ఆస్తమా విశేషాలు ఉపయుక్తంగా ఉన్నాయి. బాలనేస్తాలులో నేర్చుకుందాం బొమ్మలు గీయడం చక్కగా వుంది. చిత్రాలలో చూపినట్లు ట్రక్కు వుండాల్సిన చోట ద్విచక్ర వాహనాలతో లాగించేయడం ప్రమాదకరం కూడా! మనలోమాటలో అన్నట్టు "కల కను, కుర్చీ కొను" నేతలు పాటిస్తే "నమ్మి ఓటేసి నట్టేట్లో మునుగు" అని ఓటర్లైన వెర్రిజనం గొణుక్కుంటున్నారు. ఏం చేస్తాం, ఒక్క ఓటుకు ఐదేళ్ళ బలి.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

ఆకట్టుకున్న అలహాబాద్

ఈవారం స్నేహ అందించిన చూద్దామాలో అలహాబాద్ విషయాలు బాగా ఆకట్టుకున్నాయ్. జవహర్‌లాల్ నివశించిన ఆనంద్ భవన్, అక్బర్ కోట బొమ్మలతో పాటు కుంభమేళా విశేషాలు బాగున్నాయి.

ఆచార్య నూతి నారాయణరావు,
హైదరాబాద్.

మనలోమాట బావుంది

ఇల్లలకగానే పండగ కాదు, కల కనగానే పదవి రాదు అనడం బాగుంది. మామిడి వంటకాలతో కమ్మని రుచిని ఇచ్చారు. యువతలో శ్రద్ధ పెరిగిందనటంలో వాస్తవం వుంది. అమ్మమ్మ కథలు చెప్పడం, మనవరాళ్ళు, మనవళ్లు ఊ కొట్టడం ముతక బారింది. కాల మహిమ. అలహాబాదులోని విశేషాలు మమ్మల్ని ఎంతో అలరింప జేశాయి. తాటి ముంజలు, కొబ్బరి నీళ్ల, చెరుకురసం వేసవిలో ప్రకృతి ప్రసాదించిన వరాలు. కిరాయి భరించలేక ద్విచక్ర వాహనాలే ట్రక్కులైనాయి.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

అమ్మ కవిత అదుర్స్

మే 10 వ తేదీ స్నేహలో మదర్స్ డే సందర్భంగా ప్రచురించిన చలపాక ప్రకాష్ గారి కవిత 'అమ్మా ఓ నా మమ్మీ' చాలా బాగుంది. అందులో అమ్మా! ఈ వాకిలి, ఈ గాలి, ఈ నేల, ఈ పైరు, ఈ చెట్టూ పుట్టా అంతా నాదైనా నాది కాకుండా వుందేమిటీ అనే వాక్యాలు అందరినీ ఆలోచింప జేసేవిగా ఉన్నాయి. అలాగే కె. అంజన గారి కథ చెప్తే ఊ... కొడతారా! అనే వ్యాసంలో చిన్న పిల్లలకు కథను చెప్పే విధానాన్ని గురించి చక్కగా వివరించారు.

కలవలపల్లి బాలసుబ్రహ్మణ్యం,
విజయవాడ.



ఫొటోలు చూశాక ఎవరికైనా మతిపోతుంది

మే 10 సంచికలో 3వ కవర్ పేజీలో ప్రచురించిన ఫొటోలు బాగున్నాయి. నిత్యం జరిగే ప్రమాదాలకు కారణమయిన ఫొటోలు చూశాక ఎవరికయినా మతి పోతుంది! ఇంత మంచి ఫొటోలు తీయడం ఒక అద్భుతమైతే ఈ ఫొటోలన్నీ సేకరించడం మరీ అభినందనీయం. ఈ పేజీని ఇలాగే పెద్దది చేయించి మన పెద్దలకు పంపితే ఇంకా బాగుంటుంది. ఫొటోగ్రాఫర్ల పేరు ప్రచురిస్తే బాగుండేది.

గీతా సుబ్బారావు, హైదరాబాద్.

★

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. ఆకర్షణీయమైన పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.



సమ్మర్ బంపర్ ఆఫర్ ! ఈ అవకాశం 2000 మందికే !

రోజుకు ఖర్చు రూ.3/- లు !

ఇంగ్లీష్‌లో సులభంగా మాట్లాడండి !

రూ.610/- ల ఇంగ్లీష్ కోర్సు రూ.200/- లకే

మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	CD	ఇవన్నీ
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.100/-	రూ.200/-

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో ఇంగ్లీష్ నేర్వబడుతుంది. ఈ కోర్స్ రూ.130/-

డివిజన్-2 ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సూత్రాలతో చాలా ఈజీగా నేర్వబడుతుంది. ఈ కోర్సు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్వబడుతుంది.ఈ కోర్సు రూ.210/-

స్పోకెన్ ఇంగ్లీష్-CD నిత్య జీవితంలో అవసరమయ్యే వివిధ రకాల 30 సిచ్యుయేషన్స్ అందరికీ అర్థమయ్యేలా, ఇంగ్లీష్‌లో మాట్లాడాలనుకునే ప్రతి ఒక్కరికీ బాగా ఉపయోగపడే విధంగా సింపుల్ ఇంగ్లీష్‌లో ఈ CD వుంటుంది.

పూర్తి డబ్బు వాపస్

మీ డబ్బుకి 100% గ్యారంటీ. ఈ కోర్సు మీకు 100% సంతృప్తిని ఇస్తుంది. మనస్ఫూర్తిగా మీకీ కోర్సు నచ్చలేదని అనిపిస్తే, ఈ కోర్సు పుస్తకాలని బరబరా చింపేసి, ఆ ముక్కల్ని 15 రోజుల్లోపల మాకు తిప్పి పంపండి. మీ డబ్బుని (కేవలం పోస్టు ఖర్చులు మాత్రం మినహాయించి) మీకు ఎమ్.ఓ.చేస్తాం. ఇది మీ డబ్బుకి మేమిచ్చే గ్యారంటీ! మీరీ కోర్సులో చేరినందువల్ల లాభమేతప్ప ఎటువంటి నష్టములేదు. గిఫ్ట్ పుస్తకాల సైజు 9 cm X 11 cm లోనూ, కోర్స్ మెటీరియల్ సైజు 18cm x 24cm లోనూ ఉంటాయి. ఈ కోర్స్ తరువాత కూడా కొన్ని కోర్స్‌లు కలవు. వాటిని మీకు నియమిత నామ మాత్రపు ఫీజుతో పంపడం జరుగుతుంది.

ఈ కోర్స్ మొత్తం రెండు నెలలు.ఒక్కొక్క రోజుకు రూ 3/-ల ఖర్చు. మొత్తం సుమారుగా రూ200/- ల తోనే ఇంగ్లీష్ నేర్చుకోండి.

4 కోర్స్ గిఫ్ట్ పుస్తకాలు ఫ్రీ

(4 ఇన్ 1 పోకెట్ సైజులో)



(బొమ్మలో చూపిన ప్రకారం కాకుండా పోకెట్ సైజు పుస్తకాలే అని గమనించగలరు)

1. వర్డ్ పవర్ (ఆంగ్ల పదాల అద్భుత శక్తి)
2. లెటర్ రైటింగ్ ప్రాక్టీస్ (ఇంగ్లీష్‌లో ఉత్తరాలు వ్రాసే పద్ధతి)
3. వెర్బ్స్ డిక్షనరీ (క్రియలు - వాటి రూపాలు)
4. సినానిమ్ & యాంటోనిమ్స్ డిక్షనరీ (ఆంగ్ల సమాన పదాలు & వ్యతిరేక పదాలు)

సమ్మర్ బంపర్ స్పెషల్ ఆఫర్ కూపన్

STUDENTS' ENGLISH INSTITUTE

4897-130

Post Bag No. 8569,
New No. 203,(C) Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.610/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు మరియు 4 ఉచిత పుస్తకాలు ,CD ఇవన్నీ కలిపి కేవలం రూ. 200/- లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

(మీ చిరునామా స్పష్టంగా అర్థమయ్యేలా ఇంగ్లీష్‌లో వ్రాయండి. లేనిచో కోర్సును పంపుటకు వీలుపడదు)

Name: ....

Address: ....

....

.... Pincode: ______

స్ఫూర్తి

- ప్రొ॥ దేవరాజు మహారాజు
కవి, రచయిత, విద్యావేత్త

అనేక ప్రశ్నలకు సమాధానం

మన పురాణాల్లో అనేకమైన అద్భుతాలు కనిపిస్తాయి. కేవలం ధ్వనిని బట్టి బాణం వేయగలగడం (శబ్దవేది), తలుపు తాకకుండానే తెరుచుకోవడం, అద్దంలో ప్రపంచాన్ని చూడగలగడం, నీళ్ల కోసం దోసిలి పడితే (ఎవరూ పోయకుండానే) నీళ్లు రావడం... వగైరా మనం ఎన్నో జానపద కథల్లో చదివాం. అంటే మనిషి మనసులో ఉన్న కోరికలన్నీ సాధించాలనుకున్నవన్నీ అలా అలా కథలుగా వేల సంవత్సరాలు తరతరాలుగా చెప్పుకుంటూ వచ్చాడు. ఇప్పుడు అవన్నీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ఫలితాల వల్ల నిజమే అయ్యాయి. ఇంకా అవుతాయి కూడా! అంటే మనిషి తన ఊహను తాను తాకగలుగుతున్నాడన్నమాట!! ఇలా హేతుబద్ధంగా ఆలోచించడమే కదా హేతువాదమంటే. అందువల్ల నాకు అనిపించేదేమంటే మనకు వైజ్ఞానిక స్పృహ ఉంటే జీవితమంతా పారదర్శకంగా కళ్లముందు కనిపిస్తుంది. భ్రమలు తొలగిపోతాయి. ఉజ్వల భవిష్యత్తు కోసం మనం పాటుపడతాం అని!

అసలు మనమెవరం? ఎక్కణ్ణించి వచ్చాం? చనిపోయిన వారంతా ఎటు పోతున్నారు? ఈ విశాల విశ్వానికి అంచు ఉందా? భూమి బంతిలా గుండ్రంగా వుంటే మరి అడుగు భాగాన ఉన్నవారు పడిపోకుండా భూమిని అంటిపెట్టుకుని ఎలా వున్నారు? ఈ కాలమేమిటి? దాన్ని మనం వెనక్కి తిప్పలేమా? ఇలాంటి ప్రశ్నలు నాకే కాదు, చాలామందికి చాలా సార్లు వస్తుంటాయి. వాటికి సమాధానాలు అన్వేషించుకునేవారు మాత్రం చాలా తక్కువ. వీటికి సమాధానాలు తెలుసుకోకపోయినా తమతమ దైనందిన జీవితం సాఫీగా గడిపేవారు గడిపేస్తుంటారు. చుట్టూ ఉన్న కుటుంబ జీవితం, సామాజిక జీవితం ఓ దేవుణ్ణి, ఓ దెయ్యాన్ని , కొన్ని సాంప్రదాయాల్ని, ఆచారాల్ని, కట్టుబాట్లని, విశ్వాసాల్ని ప్రసాదిస్తుంది కనుక వాటిలో మునిగి చాలా మంది బతికేస్తుంటారు. ఏదో ఓ దేవుణ్ణి నమ్ముకుని, ఏవో కొన్ని పూజలు చేసుకుని నిశ్చింతగా బతికే జనమే ఎక్కువ. దేవుడు లేడని నమ్మేవారు ఏదో కొద్ది శాతం మాత్రమే. అందులో మరి కొద్దిమంది మాత్రం దేవుడు ఎలా వుంటాడు? వుంటే అతడి మెదడు ఎలా పనిచేస్తుంది? పోనీ... దేవుడు లేడా? అయితే మరి అతని స్థానంలో ఎవరున్నారు? ప్రపంచాన్ని నడిపించే శక్తిగా మనం దేన్ని పరిగణిస్తున్నాం? శాస్త్రీయ దృక్పథంతో చూస్తే మానవుడి విశ్వాసాలు ఎంత వరకు నిలబడతాయి? వంటి సంక్లిష్టమైన అంశాల గూర్చి ఆలోచించగల వారు మరీ తక్కువ.



వైజ్ఞానిక సాహిత్య కళారంగాల్లో గుర్తింపు తెచ్చుకున్నవారు సామాజిక సేవకులు, దార్శనికులు ఏదో ఒకే ఒక పుస్తకంతోనే స్ఫూర్తి పొందుతారని నేననుకోను. ఎన్నో పుస్తకాలు, ఎన్నో కళలు, మరెన్నో జీవితాలు, ఎన్నెన్నో పరిస్థితులు మొత్తానికి మొత్తంగా వాటి సారమంతా కలిపి వారి ధ్యేయానికి రూపకల్పన చేసుకుంటారనుకుంటా. నేను వ్యక్తిగా, కవిగా ఎదుగుతున్న తొలి దశలో కొన్ని పుస్తకాలు నన్ను ప్రభావితం చేశాయి. ప్రేరణనిచ్చాయి. ఆ లిస్టు కూడా చాలా పెద్దది. వాటన్నింటి గూర్చి చెప్పే వీలు లేదు కాబట్టి, ఒకటి రెండు పుస్తకాల గూర్చి చెబుతాను.

నేను స్కూల్ విద్యార్థిగా ఉన్నప్పటి నుండే కవితలు, కథలు రాయడం మొదలు పెట్టాను. కాలేజీలో చేరినప్పటి నుండి రచనలు పత్రికల్లో ప్రచురితమౌతున్నాయి. డిగ్రీ విద్యార్థిగా 'భారతి'లో వ్యాసాలు రాశాను. రేడియోకి విరివిగా రాస్తూ కథల పోటీలో బహుమతి కూడా గెల్చుకున్నాను (ఆంధ్రజ్యోతి- పాలు ఎర్రబడ్డాయ్). అందువల్ల చాలా మంది నన్ను బియస్సీ తర్వాత యం.ఎ లో చేరమన్నారు. భాషమీద, వ్యాకరణం మీద పట్టు సాధిస్తే మంచి కవిత్వం రాయడానికి వీలుంటుందన్నారు. కానీ నేను జీవశాస్త్ర సంబంధమైన అవగాహనే ముఖ్యమనుకుని ఎమ్మెస్సీలో చేరాను. అక్కడ ఛార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం నాలో ఒక కొత్త ద్వారాన్ని తెరిచింది. అతి కష్టంమీద 'ఆరిజిన్ ఆఫ్ స్పీసెస్' పుస్తకం సంపాదించి అధ్యయనం చేయడం ప్రారంభించాను. దాని సారాన్ని గ్రహించి స్ఫూర్తి పొందిన వారికి జీవితం పట్ల ఒక స్పష్టమైన అవగాహన కలుగుతుందని ప్రగాఢంగా విశ్వసించడం ప్రారంభించాను. డార్విన్ గొప్పతనమేమంటే ఒక దిశలో నడుస్తున్న ప్రపంచ గమనాన్ని తన ఆలోచనలతో అడ్డుకుని, ఆపి దాని దిశను మళ్లించగలిగిన మహా శాస్త్రవేత్త! ఒక రకంగా మనిషి ఔన్నత్యాన్ని కీర్తించిన మహానుభావుడు. ముప్పయ్యేళ్లగా ఎమ్మెస్సీ విద్యార్థులకు జీవశాస్త్రం బోధిస్తున్నా, నాకు ఎప్పటికప్పుడు జీవితానికి అన్వయించుకునే కొత్త విషయాలు డార్విన్ సిద్ధాంతం నుండి లభిస్తూనే ఉన్నాయి. ఏ చదువు చదివినా, ఏ ఉద్యోగంలో ఉన్నా ప్రతివారికి శాస్త్రీయ దృక్పథం చాలా అవసరం. విచారించాల్సిన విషయం ఏమంటే ఉన్నత విద్యనభ్యసించిన వారు, మేధావులుగా చలామణి అయ్యేవారు కూడా హేతుబద్ధంగా ఆలోచించకుండా, మూఢ నమ్మకాలలో పడి కొట్టుకుపోతుంటారు.

మరి కొంత కాలం తర్వాత నేను పి.హెచ్.డి కోసం వృక్ష పరాన్న జీవుల మీద పరిశోధన చేస్తున్న దశలో ఒక రోజు పుస్తకాల షాపులో 'స్టీఫెన్ హాకింగ్'

రాసిన పుస్తకం 'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' (కాలం కథ) కనిపించింది. కొని చదువుతూ ఉంటే ఎప్పటి నుండో నాలో కొట్టుకుంటున్న అనేకానేక ప్రశ్నలకు ఆ పుస్తకం సమాధానాలీయగలిగింది. కాలం గురించి, స్థలం గురించి, వాటి మధ్యగల కార్యకారణ సంబంధాల గురించి, వాటికి ఉన్న అనేక పార్శ్వాల గురించి, బిగ్ బ్యాంగ్ నుండి బ్లాక్ హోల్ దాకా ఎన్నెన్నో విషయాలను ఆ పుస్తకం చర్చించింది.

కొంతమంది చెపుతుంటారు కాలమంటే దేవుడే అని, కాలంలోనే దేవుడున్నాడని! కానీ కాలం అనేది ఈ విశ్వాంతరాళానికున్న గుణగణాల్లో ఒకటి కదా? ఈ విశ్వమే దేవుడు సృష్టించిందని నమ్ముతున్నప్పుడు దానిలో అంతర్భాగమై ఉండి, దాని గుణాల్లో ఒకటైన కాలంలో దేవుడుండడమేమిటి? అనేది ప్రశ్న. సృష్టికర్త తను సృష్టించిన దానికన్నా ఉన్నతుడై ఉంటాడు కానీ, తను సృష్టించిన దానిలోనే అంతర్భాగమై ఉండడు కదా?

'ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' పుస్తకం అనేక సవాళ్లను మన ముందు ఉంచుతుంది. ఒక రకంగా అది దేవుడి గురించి చెప్పిన పుస్తకం. మరో రకంగా దేవుడనే శూన్యాన్ని విశ్లేషించిన పుస్తకం. అర్థం చేసుకుని అన్వయించుకునే దాన్ని బట్టి పాఠకుని అవగాహన పెరుగుతుంది. ఏదైనా పనిని మనం అనుకున్నది అనుకున్నట్టుగా చేయలేం. ఏవో కొద్దిపాటి అవకతవకలు తప్పవు. అవి ఎందుకు తప్పవూ అంటే అదే దైవేచ్ఛ అని అంటున్నారు. నువ్వు చేయదలుచుకున్న దానికి, దైవాభీష్టానికి కొంత తేడా ఉంటుందంటున్నారు. ఆ తేడాల్ని 'టైమ్ అండ్ స్పేస్' తోపాటు వాటి డైమెన్షన్స్ గురించి లోతుగా అధ్యయనం చేయగలిగినప్పుడు సమాధానాలు దొరుకుతాయి.

ఎందరో ఉన్నత స్థాయి సాహితీవేత్తలు మనకున్నారు. వారందరిలో ఒక చిన్నపాటి ప్రత్యేకతను నేను సంతరించుకోగలిగింది ఎందుకంటే – కేవలం అది నా వైజ్ఞానిక దృక్పథం వల్లనే అని అనుకుంటున్నాను. సాహిత్య – వైజ్ఞానిక రంగాల మధ్య వారధిగా నిలబడగలిగినందుకే అని తలుస్తున్నాను. జీవం గురించి, జీవ పరిణామం గురించి లోతుగా అధ్యయనం చేయగలిగే అవకాశం నాకు వచ్చింది కాబట్టి ఆ విజ్ఞానం వృథా కాకుండా దాన్ని నా రచనలకు వెన్నెముకగా మలచుకోగలుగుతున్నాను. కాబట్టి నా రచనలు రొటీన్ కంటే కొంత భిన్నంగా ఉంటున్నాయేమో? ఆ అవగాహనే లేకపోతే 'లైఫ్ టానిక్', 'మూఢ నమ్మకాల్ని వదిలిద్దాం!' వంటి నాటికలు, మనిషి కథలు, డాక్యుమెంటరీ స్టోరీలు, 'కాలాన్ని వెనకేసిన మనిషి' వంటి ప్రయోగాత్మక రచనలు చేసి ఉండేవాణ్ణి కాదు. నా కవిత్వం సీరియస్‌గా చదివే పాఠకులు ఒక విషయం గమనించే వుంటారు. తెలుగు పండితులైన ఇతర కవులు రాసే వాక్యాలికీ, సైన్స్ నేపథ్యంలోంచి నేను రాసే కవితా చరణాలకీ ఉన్న తేడా.

ఈ విశాల విశ్వాన్ని ఉన్నదున్నట్టుగా దేవుడు సృష్టించాడని నమ్మేవారితో గొడవేలేదు. వారితో చర్చించాల్సింది కూడా ఏమీలేదు. కానీ పరిణామ క్రమం మీద గౌరవమున్న జిజ్ఞాసువులెవరైనా జీవ పరిణామాన్ని అధ్యయనం చేస్తే, వారు తెలుసుకున్న దాన్ని మనస్ఫూర్తిగా విశ్వసిస్తే వారు హేతువాదులవుతారు. మార్క్సిస్టులవుతారు. స్త్రీ వాదులు, దళిత వాదులు చివరికి మానవతా వాదులూ అవుతారు. ఎందుకంటే వాటన్నింటి మూలాలు జీవ పరిణామంలోనే సూక్ష్మాతి సూక్ష్మంగా నిబిడీకృతమై ఉన్నాయి.

ఎన్ని దశలు దాటి, ఎన్ని బిలియన్ సంవత్సరాల కాలాన్ని దాటి జంతు లక్షణాలు వదులుకుని, ఆదిమానవుడు మనిషయ్యాడన్నది అర్థమయితే... మళ్లీ ఇప్పుడు మనిషి తిరోగమనంలో జంతు ప్రవర్తన ప్రదర్శించడు కదా?

ఒక్కో కాలంలో ఒక్కో జీవి ఈ భూమ్మీద ఆధిపత్యం ఎలా చలాయించగలిగిందో తెలుసుకుంటే, కాలానుగుణంగా ఎలా మరుగున పడిందో అర్థం చేసుకుంటే ఇప్పుడు ఆధిపత్యం వహిస్తున్న మనిషి ఇంత క్రూరంగా విర్రవీగడు కదా? తన నాశనానికి తానే కారకుడవ్వడు కదా?

ప్రకృతిలో అన్ని జంతు, వృక్ష జాతులకు వాటివాటి శక్తిని బట్టి, వాటి పరిసరాలను బట్టి సమానావకాశాలు లభించాయని తెలుసుకుంటే మనుషులే మనుషుల్ని అణగదొక్కరు కదా?

ఈ రకంగా ఆలోచించి తెలుసుకోగలిగింది, నేర్చుకోగలిగింది ఎంతైనా ఉంది.

పచ్చిమాంసం తినే ఆదిమానవుడు అత్యాధునిక మానవుడిగా ఎలా పరిణామం చెందాడో పూర్తిగా అవగాహన చేసుకుంటే మరో శక్తి గురించి ఆలోచించే అవసరమే ఉండదు. అంతేకాదు అంధ విశ్వాసాల ఆయుష్షు కూడా తగ్గిపోతుంది.

మన పురాణాల్లో అనేకమైన అద్భుతాలు కనిపిస్తాయి. కేవలం ధ్వనిని బట్టి బాణం వేయగలగడం (శబ్దవేది), తలుపు తాకకుండానే తెరుచుకోవడం, అద్దంలో ప్రపంచాన్ని చూడగలగడం, నీళ్ల కోసం దోసిలి పడితే (ఎవరూ పోయకుండానే) నీళ్లు రావడం... వగైరా మనం ఎన్నో జానపద కథల్లో చదివాం. అంటే మనిషి మనసులో ఉన్న కోరికలన్నీ, సాధించాలనుకున్నవన్నీ అలా అలా కథలుగా వేల సంవత్సరాలు తరతరాలుగా చెప్పుకుంటూ వచ్చాడు. ఇప్పుడు అవన్నీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధించిన ఫలితాల వల్ల నిజమే అయ్యాయి. ఇంకా అవుతాయి కూడా! అంటే మనిషి తన ఊహను తాను తాకగలుగుతున్నాడన్నమాట!! ఇలా హేతుబద్ధంగా ఆలోచించడమే కదా హేతువాదమంటే. అందువల్ల నాకు అనిపించేదేమంటే మనకు వైజ్ఞానిక స్పృహ ఉంటే జీవితమంతా పారదర్శకంగా కళ్లముందు కనిపిస్తుంది. భ్రమలు తొలగిపోతాయి. ఉజ్వల భవిష్యత్తు కోసం మనం పాటుపడతాం అని!

చివరగా యువతరానికి ఓ మాట చెప్పాలనిపిస్తోంది. కంప్యూటర్ – ఇంటర్నెట్ సౌకర్యం వచ్చినా అవి పుస్తకాలకు ప్రత్యామ్నాయాలు కావు. పుస్తకం పుస్తకమే! దాని స్థానం దానిదే. దాన్ని నమ్ముకున్న వారు మాత్రమే వారి కాళ్లమీద వారు నిలబడడమే కాదు. వారి కాలంలో వారు తప్పక నిలబడతారు. ★



అందువల్ల చాలా మంది నన్ను బియస్సీ తర్వాత యం.ఎ లో చేరమన్నారు. భాషమీద, వ్యాకరణం మీద పట్టు సాధిస్తే మంచి కవిత్వం రాయడానికి వీలుంటుందన్నారు. కానీ నేను జీవశాస్త్ర సంబంధమైన అవగాహనే ముఖ్యమనుకుని ఎమ్మెస్సీలో చేరాను. అక్కడ ఛార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం నాలో ఒక కొత్త ద్వారాన్ని తెరిచింది. అతి కష్టంమీద 'ఆరిజన్ ఆఫ్ స్పీసెస్' పుస్తకం సంపాదించి అధ్యయనం చేయడం ప్రారంభించాను. దాని సారాన్ని గ్రహించి స్ఫూర్తి పొందిన వారికి జీవితం పట్ల ఒక స్పష్టమైన అవగాహన కలుగుతుందని ప్రగాఢంగా విశ్వసించడం ప్రారంభించాను. డార్విన్ గొప్పతనమేమంటే ఒక దిశలో నడుస్తున్న ప్రపంచ గమనాన్ని తన ఆలోచనలతో అడ్డుకుని, ఆపి దాని దిశను మళ్లించగలిగిన మహా శాస్త్రవేత్త! ఒక రకంగా మనిషి ఔన్నత్యాన్ని కీర్తించిన మహానుభావుడు. ముప్పయ్యేళ్లగా ఎమ్మెస్సీ విద్యార్థులకు జీవశాస్త్రం బోధిస్తున్నా, నాకు ఎప్పటికప్పుడు జీవితానికి అన్వయించుకునే కొత్త విషయాలు డార్విన్ సిద్ధాంతం నుండి లభిస్తూనే ఉన్నాయి.

సీరియల్

గని



జరిగినకథ:

ఎట్టకేలకు తివారీ కుమార్తె పెళ్లి కుదురుతుంది. దానికి దంపతులిద్దరూ ఎంతగానో సంతోషిస్తారు. అయితే నిశ్చితార్థానికి మాత్రం ఇరువైపు బంధువులను పిలవకూడదంటాడు తివారీ. పైగా వ్యాపార భాగస్వాములను, స్నేహితులను పిలిస్తే చాలంటాడు. అందుకు భార్య చిన్నబుచ్చుకుంటుంది. బాధపడుతుంది. అది ఆమెకు ఏమాత్రం ఇష్టం లేదు. అయినవారందరినీ పిల్చి ఘనంగా నిశ్చితార్థం చేయాలన్నది ఆమె కోరిక. నిశ్చితార్థానికి పిలవకుండా పెళ్లికి పిలిస్తే బంధువులు వస్తారా అన్నది ఆమె మనసులోని పెద్ద అనుమానం. అవేమీ తివారీ వినే స్థితిలో లేదు. తప్పక అందుకు ఒప్పుకుంటుందావిడ. ఆ తర్వాత...

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి
అనువాదం : వి. వెంకటేశ్వర

(ఎనిమిదవ భాగం)

వియ్యంకులవారు ఘనంగా స్వాగతం పలికారు. అన్ని ఏర్పాట్లూ చక్కగా చేశారు. అన్ని విషయాలూ మాట్లాడుకొన్నాక ఫలానా వారి అబ్బాయికి, ఫలానా వారి అమ్మాయినిచ్చి వివాహం జరిపిస్తామని అమ్మాయి తరపు వారు ఓ పత్రంపై రాసి, సంతకం పెట్టారు. వంగదేశపు సంప్రదాయం ప్రకారం కుంకుమలో బంగారు నాణాన్ని అద్ది, ఆ పత్రంపై ముద్ర వేశారు.

నిశ్చితార్థం పూర్తయ్యాక అనేక రకాల వంటకాలతో షడ్రసోపేతమైన విందుభోజనం ఏర్పాటు చేశారు. అమ్మాయి తరపున ఎందరో పెద్ద మనుషులు విచ్చేయడం పెండ్లికొడుకు తరపు వాళ్లకు బాగా నచ్చింది. అమ్మాయి తరపు వాళ్లకు వంగి వంగి సపర్యలు చేయడంలోనే ఇది బహిర్గతమైంది.

భోజనాలయ్యాక స్త్రీలూ, పురుషులూ తమ తమ పరిచయాలకు అనుగుణంగా జట్లుజట్లుగా కూచుని పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నారు. శకుంతలాదేవి మాత్రం పైకి ఎంతో సంతోషంగా ఉన్నట్టు కనిపించడానికి ఎంత ప్రయత్నిస్తున్నా, ప్రగాఢమైన బాధ ఆమె గుండెను మెలి పెడుతోంది. రేపు తన కూతురికి తన గతే పట్టదని ఎలా నమ్మేది? ఆంగ్ల విద్యను అభ్యసించిన పిల్లల మధ్య కేవలం బెంగాలీ మాత్రమే తెలిసిన తమ బంధువులు రావడం తమ ప్రతిష్ఠను దిగజార్చుతుందని తన భర్త అమ్మాయికి హితువు పలికాడు. అది ఎంత దారుణమైన ఆలోచన? గోధుమ విత్తులు చల్లితే వరి పండుతుందా? నాగరికత విస్తరించే కొద్దీ, వక్ర చింతన గాల్లో విషవాయువుల్లా కలిసి ఎల్లడలా పరచుకొంటోంది. కలియుగం ముదిరే కొద్దీ మానవ సంబంధాలు శుష్కించిపోతాయి కాబోలు.

ఇంతలో శకుంతలాదేవి మన్ణతటాకంలో రాయిపడింది. "వియ్యంకుల వారి ఇంటిని వదిలి పెట్టి మన ఇంటికి బయలు దేరాలంటే మనసు రావడం లేదా? ఇకపై నాకు భార్య చేతి కమ్మని భోజనం లభించదు లాగుందే" అంటోన్న భర్త హాస్యోక్తి ఆమె ఆలోచనలకు భంగం కలిగించింది.

ఆమె కూడా పెదాల మీదికి చిరునవ్వు తెచ్చుకొని "ఇక్కడ కూడా నన్ను పొగడకుండా ఉండలేరు" అంది.

"ఈ పూటకు ఇక్కడే ఉండి, రేపు పోవచ్చు గదా!" అని మాట వరసకు చెప్పిన వియ్యంకులకు వీడ్కోలు పలికి బయలుదేరారు.

తెల్లని కొంగలా పరచుకొన్న వెన్నెల. పంటకోతల సమయం. దారి పొడుగునా, కోసిన పైరు నుంచి గోధుమ గింజల్ని వేరుచేసే పని. ఓపక్క అలా వేరుచేసిన గింజల్నించి పొల్ల గింజల్ని ఏరేపని, మరో పక్క జమిలిగా సాగుతున్నాయి. ఎండలో ఆరబెట్టడానికి అనువుగా కొంత దూరంలో గోధుమను పరుస్తున్నారు. కొందరు శ్రమ తెలియకుండా శృంగార రస ప్రధానమైన పాటలు పాడుతూ సందడి చేస్తున్నారు కొందరు. అసూయా, పోటీతత్వం పెరిగి, విరుగుతుండగా గోల పెడుతూ ఆడుకొంటున్న పిల్లలు. పిల్లలూ, కుక్కలూ వాళ్లతో బాటు ఆడుతున్నట్టు నటిస్తున్నాయి. పసుపురంగు చంద్రకాంతి నేలపై పడి మరింత చల్లదనాన్ని సమకూర్చుతోంది. మట్టి వాసన, పొట్టు తీసేసిన గోధుమ కుప్పలలోంచి వెలువడుతోన్న వాసనా వాతావరణాన్ని ఆహ్లాదభరితం చేస్తున్నాయి.

ఈ సుందర దృశ్యం తమదృష్టిలో పడ్డట్టు గానీ, తమ మనసుల్ని ఆకర్షించినట్టుగానీ తెలియపరచని విధంగా వాళ్లంతా ఏదో మాట్లాడుకొంటూ, నవ్వుకొంటూ ప్రయాణం చేస్తున్నారు. ఎవరు ఏం మాట్లాడుతున్నా, తివారీ కుటుంబానికి కుదిరిన సంబంధం గురించిన ప్రస్తావన, తమ మాటల్లో జోడిస్తున్నారు. వాళ్ల మాటల్లో కాబోయే వియ్యంకుల పట్ల గౌరవం, ప్రశంస ధ్వనిస్తున్నాయి. ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు వాళ్ల ప్రశంసలు కురిపిస్తున్నారు.

అయితే ఇవేవీ శకుంతలాదేవికి నిజమైన సంతోషాన్ని కలిగించలేదు. అయితే పైకి మాత్రం వాళ్ళ ఆగమనాన్నీ, అభినందనల్నీ కృతజ్ఞతాపూర్వకంగా స్వీకరిస్తున్నట్టు చక్కగా తన అభినయకౌశల్యాన్ని ప్రదర్శించింది.

నిశ్చితార్థం తరువాత సాంప్రదాయకమైన తతంగాలు కొన్ని నిర్వహించారు. అబ్బాయి తరుపువాళ్ళు అమ్మాయి ఇంటికి వచ్చి తమ స్తోమతకూ, ప్రతిష్టకూ అనుగుణంగా ఓ విలువైన నగను పెండ్లి కూతురికి కానుకగా సమర్పించే 'ఆశీర్వాద్' అనే కార్యక్రమం ముగించారు.

తరువాత అమ్మాయి తరుపువాళ్ళు అబ్బాయి వాళ్ళ ఇంటికి వెళ్ళి 'ఆశీర్వాద్' నిర్వహించారు. తరతరాలుగా కొనసాగుతోన్న ఈ సంప్రదాయాన్ని మార్చాలని ఎవరూ ప్రయత్నించరు. రంగులరాట్నం పైకీ కిందికీ తిరగడంలాంటివే ఈ సంప్రదాయాలు.

పెళ్లి ముహూర్తం దగ్గరపడింది. తివారీ, శకుంతలాదేవి ఇద్దరూ వెళ్ళి తమ తల్లిదండ్రులనూ, తోబుట్టువులనూ ఆహ్వానించారు. లగ్న పత్రికకూ ఆహ్వానించలేకపోయినందుకు విచారం నటించారు. అయితే (కపట జీవితాన్నీ, నటననూ జీర్ణించుకోలేక) శకుంతలాదేవి లోలోపల కుతకుతలాడుతోంది. ఎలాగైనా, భర్తతో జీవనబంధం కొనసాగవలసిందే కదా.

ఐశ్వర్యం కలగగానే స్వభావాన్ని సైతం మార్చుకోవలసిన పరిస్థితి! ఈ కాలంలో తక్కిన అన్నింటికన్నా ధనానిదే పై చేయిగా ఉంది. అది తల్లిదండ్రుల్ని గానీ, పిల్లల్ని గానీ, భార్యనూ గానీ, భర్తను గానీ మొత్తానికి ఏ బంధాన్ని గానీ లెక్క చేయదు. పూర్వ సంబంధాలకూ, పరిచయాలకూ దూరంగా మసలాల్సిన పరిస్థితి. తొలిరోజుల్లో తిండి తిప్పలు పంచుకొంటూ, లోకాభిరామాయణం ముచ్చటించుకొంటూ తమతో కలిసిమెలిసి నడచిన జీవితాలన్నీ కలలా కరిగిపోయ్యాయి. బంగారు పంజరంలోని చిలకలా ఒంటరిగా చిక్కుకున్నాను. పంజరపు చిలుకకు తియ్యని పళ్ళు లభిస్తాయి గానీ రెక్కలార్చుకొని ఆకాశమే హద్దుగా పయనించే స్వేచ్ఛ గానీ, నును వెచ్చని స్నేహాలు గానీ లభిస్తాయా? నా జీవితం కూడా అలా అయిపోవాలా? జ్ఞాపకాల ద్వారా ఓదార్పు పొందే ప్రత్యేక గుణం మనిషికి ఉన్నందువల్లే అతడు అన్ని ప్రతిబంధకాల నుంచీ తనను కాపాడుకోగలుగుతున్నాడా? భార్యాభర్తల మధ్య ఎలాంటి బంధం ఏర్పడుతుందని ఎవరైనా చెప్పగలరా? జ్ఞాపకాల్లో కూరుకుపోయి, ఆమె తనను తాను మరచిపోయింది.

భర్త గొంతు వినగానే జ్ఞాపకాలను చెరిపేసుకొని భర్త చెప్పదలచుకున్న విషయాన్ని వినడానికి ఆసక్తి కనబరుస్తున్నట్టు "చెప్పండి" అంది.

"బంధుమిత్రులు, వియ్యంకులు వాళ్ళ తరపు జనం ఇలా అందరు వస్తున్నారు కదా, వాళ్ళను ఎలా స్వాగతించాలి, వాళ్ళకు విందు ఎలా ఏర్పాటు చేయాలా అని ఆలోచిస్తూ ప్రపంచాన్నే మరచిపోయావా ఏం?" ప్రశ్నించి, జవాబు ఆశించని వాడల్లే తానే చెప్పసాగాడు.

"మన కంపెనీ మేనేజరుకు బాధ్యతలన్నీ అప్పగించాను. ప్రతి ఒక్కరినీ వాళ్ళ వాళ్ళ స్తోమతను బట్టి ఎలా స్వాగతించాలో, ఎక్కడ విడిది ఏర్పాటు చేయాలో, అల్లుడిని మేళతాళాలతో ఊరేగింపుగా ఎంత గొప్పగా స్వాగతం పలకాలో, ఎవరికి ఏ పని అప్పజెప్పాలో అన్నిటికీ ప్రణాళిక తయారు చేశాను. శుభలగ్నం చూసి అమ్మాయిని చక్కగా అలంకరించి కళ్యాణ మంటపానికి పిలుచుకు వెళ్లడమే మన పని" అన్నాడు.

వెలిగిపోతోన్న మోహంతో అతడు తన కార్యనిర్వహణా సామర్థ్యాన్ని చాటి చెబుతుంటే అతడి మాటల్లో గాంభీర్యమూ, గర్వమూ తొణికిసలాడాయి. తమ ఇంటిపెండ్లి వేడుకకు కార్మికులూ, చుట్టుపక్కల పల్లెల్లోని గ్రామీణులూ, కంకుల్లో జొన్న గింజల్లా తండోపతండాలుగా తరలివస్తారని ఊహించుకొని మురిసిపోయాడు.

శకుంతలాదేవికి ఎక్కడలేని చలాకీతనం వచ్చేసింది. అమ్మాయికి మంచి సంబంధం కుదరడం, ఈ ప్రాంతంలో ఎవరూ ఎన్నడూ చూడనంత ఘనంగా, ఆడంబరంగా అమ్మాయి పెళ్ళి చేస్తుండడం వల్ల తమ అంతస్తు మరింత పెరగడం తలచుకొని పులకించిపోయింది. ఒక నిరుపేద పూజారి భార్యకు ఎంతో పరపతీ, పలుకుబడీ, సిరిసంపదలూ కలిగిన పెద్దల పరిచయ భాగ్యం కలగడం, వాళ్లతో సరిసమానంగా కూర్చొని కబుర్లాడుకునే అర్హత లభించడం భగవంతుడికి నిష్ఠగా చేసిన సేవలకు లభించిన ఫలితం కాకపోతే మరేమిటి! అని మనసులో భావించిందామె.

వివాహ మంటపానికి వెళ్లడానికి ముందు 'గాయేగాల్' (ముత్తైదువులు పాటలు పాడుతూ, పెండ్లికూతురి ఒళ్ళంతా పసుపురాసి మంగళ స్నానం చేయించడం) పూర్తయిందా అని తెలుసుకోవడానికి పరుగుపరుగున వెళ్ళింది. సరైన సమయంలో అది పూర్తయిందనీ, తాను ఆనందాతిరేకంలో తాను విషయాన్ని మరిచిపోయిందనీ గ్రహించింది.

గదిలోకి వెళ్ళి అమ్మాయి అలంకరణను చూచి ఆనందించింది. అప్సరసలా ఉంది అనుకొని మురిసిపోయింది. పెండ్లి మంటపానికి వెళ్ళడానికి సిద్ధం కండని చెప్పి, తానూ తయారవడంలో నిమగ్నురాలైంది.

ఎన్నెన్నో పనులు చూసుకోవాల్సి ఉన్నందున, ఆమెకు కొంత గందరగోళంగా ఉంది. ముహూర్తం రోజు పొద్దున పెండ్లికొడుకు తరుపువాళ్ళు ఒక పెద్ద చేపను బాగా అలంకరించి, పెండ్లికూతురు ఇంటికి పంపిస్తారు. ముత్తైదువలు చేప తినొచ్చు, వితంతువులు తినరాదు అని దానికి అర్థం. చేప ముత్తైదువులకు ప్రతీక. దాన్ని శుభ శకునంగా కూడా పరిగణిస్తారు. ఈ పని సక్రమంగా పూర్తయిందో లేదో తెలుసుకొనేందుకు భర్త వద్దకు వెళ్ళింది.

ఆనందం నిండిన అతడి మొగంలో కొద్దిపాటి ఆందోళన చోటు చేసుకుంది. భార్య దేనికోసం వచ్చిందో అతడు పసిగట్టాడు. అనుభవజ్ఞుడైన ఏ భర్తకైనా అది సహజలక్షణం. నెమ్మదిగా అన్నాడు "పట్టారాని సంతోషంతో నువ్వు అన్నీ మరిచిపోతున్నావు. చివరికి నువ్వు చేసిన పనుల్ని సైతం మరిచిపోయేంతగా ఏదో నిన్ను ఆడిస్తోంది".

గందరగోళం, తటపటాయింపూ ఉన్నప్పటికీ ఆమె చేప సంగతి అడిగింది.

అతడు నవ్వాపుకోలేక, చేతివేళ్ళను నోటికి అడ్డం పెట్టుకొన్నాడు. ఊదిన గాలిబూరను అదిమితే, కొద్దిగా పెరిగి, ఆపై పేలినట్టు అతడి చెంపలు పొంగి, తగ్గాయి. నవ్వు తాలూకు వెలుగు మొగమంతా పరుచుకొంది. 'వెర్రిదానా! ఏం చేస్తున్నదీ, ఏం మాట్లాడుతున్నదీ నీకు గుర్తున్నట్టే లేదు. పొద్దున వియ్యంకుల వాళ్ళు పంపిన చేపేకదా మాధ్యాహ్నభోజనంలో ఘుమఘుమలాడింది. వచ్చిన వాళ్ళకు వడ్డించేలా వంటవాళ్ళ దగ్గరుండి నువ్వే కదా చూసుకొన్నావు' అన్నాడు.

ఆమెకు జ్ఞాపకం వచ్చింది. ఒక స్త్రీని అలంకరించినట్లు అలంకరించి, బంగారు నగను పెట్టినట్టు ఓ అందమైన పెట్టెలో పెట్టి, పొద్దున కారులో పంపారు. పెళ్లికూతుర్ని గంపలో పెట్టి తీసుకొచ్చినట్టు, ఆ చేపను ప్రత్యేక శ్రద్ధతో ఇంట్లోకి తీసుకొచ్చారు. పెళ్లి కూతురి తల్లిదండ్రులు సమక్షంలోనే ఇదంతా జరిగింది. ఆ వేడుకను గమనించి ఉబ్బితబ్బిబ్బయిన తాను దాన్నెలా మరిచిపోగలిగింది? ఆమెకు ఆశ్చర్యం అనిపించింది. "మీ హడావుడి వల్లే అంతా మరిచిపోయాను" అంది భర్తతో, పరిహాసంగానూ, నర్మగర్భంగానూ.

హడావుడి ఆర్భాటమూ నిండిన పగలు, ప్రకృతి ఆలపించే మౌనగీతం లాంటి సాయంత్రానికి దారి విడిచింది. చెట్లుగా, వాగులుగా ఇంకా రకరకాలుగా దర్శనమిస్తున్నాయి మేఘశకలాలు. రేయి ఒడిలో తలపెట్టి నిద్రించడానికి తయారవుతున్నాడు సూర్యుడు. చేయి తిరిగిన చిత్రకారుడి కల్పనాశక్తికి సైతం పట్టుబడని సృష్టి సౌందర్యం ఎల్లెడలా పరుచుకొంటోంది.

గోధూళి వేళ, గోధూళివేళ గడిచిన తరువాతే వివాహానికి శుభలగ్నం ఒనగూరుతుందని బెంగాల్ ప్రజల నమ్మకం. అందువల్ల పెళ్ళిళ్లు రాత్రిపూటే జరుగుతాయి. రాత్రిపూట ఏ సమయానికి మంచి లగ్నం వస్తుందో దాన్నే వివాహలగ్నంగా భావిస్తారు. తివారీ కూతురి పెళ్లికి ముహూర్త సమయం రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము ఒంటిగంట వరకు.

(ఇంకావుంది)

తలనొప్పిని అర్థం చేసుకోవడమెలా!



మనం రోజూ వినే పదం తలనొప్పి. ఇది వయో, లింగ బేధం లేకుండా అందరినీ బాధపెడుతుంది. ఈ తలనొప్పి ఒక్కోసారి రోగులనే కాకుండా చికిత్స చేసే డాక్టర్‌కూ తలనొప్పిగా మారుతుంది. తలనొప్పి ఒక్క మెదడుకు సంబంధించిన వ్యాధుల వల్లనే కాకుండా చెవి, ముక్కు, కన్ను, ఎముకలకు సంబంధించిన, మానసిక వ్యాధుల వల్ల కూడా రావచ్చు. తలనొప్పి తర్వాత ఐదుగురిలో ఒకరు మైగ్రెయిన్ తలనొప్పితో బాధపడతారు. కళ్లెదుట ఫ్లాష్‌లైట్లు పడినట్లు, తాత్కాలికంగా చూపు కోల్పోయినట్లు, శరీరంలో ఒకవైపు భాగం స్తబ్దుగా ఉన్నట్లు అనిపిస్తుంది. గర్భనిరోధక మాత్రలు వాడే మహిళలకు తలనొప్పి వస్తుంది. తలనొప్పిలో టాప్ మైగ్రెయిన్ తలనొప్పి. 4 నుంచి 72 గంటల మధ్య తలనొప్పి వుంటుంది. ఈ మధ్య ఆర్థిక సంక్షోభం వల్ల ఉద్యోగాలు కోల్పోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల యువతలో ఒత్తిడి పెరిగి తలనొప్పితో బాధపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వీరికి మైగ్రెయిన్ తలనొప్పి వచ్చే అవకాశముంది. మెదడులోని రక్తప్రసరణలో లోపం, ఫిట్స్ వల్ల కూడా తలనొప్పి వుంటుంది. అసలు తలనొప్పి ఎందుకొస్తుంది? కారణాలేంటి? లక్షణాలేంటి? చికిత్స ఏంటి? వంటి వివరాలు ఈ వారం ....

మహిళల్లో ముఖ్యంగా ఇరవై సంవత్సరాలు పైబడిన వారికి ఎక్కువగా ఒత్తిడితో కూడిన తలనొప్పి వస్తుంది. ఇది సాధారణంగా వచ్చే తలనొప్పి. పని ఒత్తిడి పెరగడం, మానసిక ఒత్తిడి, బ్యాడ్ పోశ్చర్ వల్ల ఈ తలనొప్పి వస్తుంది. అయితే ఇది కొన్ని గంటల తర్వాత తగ్గిపోతుంది. కొన్ని సార్లు రోజులు, వారాలపాటు ఉండే అవకాశముంది. డిప్రెషన్‌లో ఉన్నవారికీ ఎక్కువగా వస్తుంటుంది. రణగొణ ధ్వనులు, వేడి వాతావరణంలో ఉన్నా ఈ నొప్పి ఎక్కువవుతుంది. ఈ తలనొప్పి పొద్దున గానీ, మధ్యాహ్నం గానీ మొదలై కొన్ని గంటలుంటుంది. కంటిపైనా, కంటిలోనూ, తలచుట్టూ నొప్పితో బాధపడతారు. మెడ కండరాలు కూడా బిగువవుతాయి. కొంతమందికి దీనివల్ల నిద్ర కూడా సరిగా పట్టదు. తలనొప్పిగా ఉన్నప్పుడు మెడికల్ షాపులో దొరికే మందులతో సరిపెట్టుకోకుండా డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. ఒత్తిడిని తగ్గించడం, యోగా, ధ్యానం, వ్యాయామం వల్ల తలనొప్పిని అరికట్టొచ్చు. రక్తపోటు ఎక్కువవున్న వారిలో రక్తప్రసరణ ఎక్కువౌతుంది. దీంతో మెదడులోని రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి తలనొప్పి వస్తుంది. అందుకే రక్తపోటును నియంత్రించాలి.

డాక్టర్ విక్రమ్ శర్మ
కన్సల్టెంట్ న్యూరోఫిజిషియన్
సెయింట్ మదర్‌థెరిసా హాస్పిటల్
సనత్‌నగర్, హైదరాబాద్
ఫోన్ : 98669 60555



క్లస్టర్ తలనొప్పి

ఇది ఎక్కువగా 30 సంవత్సరాలు పైబడిన పురుషుల్లో కనిపిస్తుంది. ధూమపానం, మద్యపానం వల్ల ఈ నొప్పి పెరుగుతుంది.

లక్షణాలు

ఇది ఉదయం పూట ప్రారంభమవుతుంది. కంటి చుట్టూ, కణతల చుట్టూ విపరీతమైన తలనొప్పి మొదలవుతుంది. దీంతో కళ్లవెంట నీళ్లు కారడం, కన్ను ఎర్రగా మారడం జరుగుతుంది. ఒక్కోసారి ముక్కులో నీరు కారుతుంది. ఒక వైపు ముఖం కందిపోతుంది. ఈ నొప్పి అరగంట నుంచి మూడు గంటల వరకు ఉంటుంది. ఒకసారి వచ్చిన తరువాత మళ్లీ నెల రోజుల వరకు ఈ నొప్పి రాకపోవచ్చు. ధూమపానం, మద్యపానం మానడం వల్ల తలనొప్పిని నివారించొచ్చు.

మెదడు సంబంధ తలనొప్పి

మెదడులో పెరిగే క్యాన్సర్ కణుతులు పెరిగిన కొద్దీ లోపల ఒత్తిడి ఎక్కువై తలనొప్పి ఎక్కువగా వస్తుంది. వాంతులవుతాయి. ఒక్కోసారి చూపు మందగిస్తుంది. కాళ్లూ చేతులు పడిపోతాయి. సిటీ-స్కానింగ్, ఎంఆర్ఐల ద్వారా కణుతులను ముందుగానే గుర్తించడం ద్వారా వైద్యం చేయడానికి వీలవుతుంది. మెడచుట్టూ పొరలు ఇన్‌ఫెక్షన్‌కు గురైనప్పుడు విపరీతమైన తలనొప్పి వస్తుంది. మెడ కండరాలు బిగువవుతాయి. చలి జ్వరమూ వస్తుంది. కంటికి సంబంధించిన సమస్యలున్నప్పుడు, దృష్టి దోషం ఉన్నప్పుడూ తలనొప్పి రావడం సహజం. చాలా సేపు పుస్తకాలు చదవడం, అధికంగా పనిచేయడం, కంప్యూటర్, టీవీ ముందు ఎక్కువ సమయం కూర్చోవడం వల్ల వస్తుంది. దృష్టి దోషాలుంటే సరైన కళ్ల జోడును వాడడం వల్ల తలనొప్పిని నివారించొచ్చు.

చిన్న పిల్లల్లో ...

స్కూలుకెళ్లే పిల్లల్లో చాలా మంది తలనొప్పితో బాధపడుతుంటారు. వారిలో సాధారణంగా జలుబు, జ్వరం వల్ల తలనొప్పి వస్తుంది. ఇది జలుబుతో పాటు తగ్గిపోతుంది. స్కూలు, పరీక్షలు, ఇంటి దగ్గర ఒత్తిడి వల్ల తలనొప్పి వస్తుంది. ఒక్కోసారి దృష్టి దోషాల వల్లా తలనొప్పి వస్తుంది. చిన్న పిల్లల్లో తలనొప్పి అనగానే పెద్దవాళ్ళు వాళ్ళకి ఏ బ్రెయిన్ ట్యూమర్ ఉన్నదోనని ఆందోళన వ్యక్తం చేస్తుంటారు. ఈ జబ్బు ఉన్నవారికి ఎక్కువ తలనొప్పి ఉండటం, వాంతులు కావటం, కంటిచూపు మందగించటం, కాళ్ళు చేతులు పడిపోవటం వంటి లక్షణాలు ఉంటాయి. చిన్న పిల్లలకూ మైగ్రెయిన్ తలనొప్పి వచ్చే అవకాశం ఉంది. ఎక్కువగా బాలికల్లో వస్తుంటుంది. కొన్ని ఆహార పదార్థాలు తలనొప్పిని ఎక్కువ చేస్తాయి. కడుపు నొప్పి, వాంతులు, అలసిపోవడం వంటివి మైగ్రెయిన్ లక్షణాలు. ఇన్ని రకాల జబ్బులు తలనొప్పికి దారితీస్తాయి. అందుకని తలనొప్పికి చికిత్స చేయడం కొన్ని సార్లు డాక్టర్‌కూ కష్టంగా మారుతుంది. ఎక్కువగా తలనొప్పి వచ్చినప్పుడు నాటు వైద్యం జోలికి వెళ్లకుండా డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

మైగ్రెయిన్ తలనొప్పి

తలనొప్పి వచ్చి వాంతులవ్వడం, చూపులో తేడా ఉండడాన్ని మైగ్రెయిన్ అంటారు. అయితే కొంత మందికి వాంతులవ్వవు. ఒక వయసు వచ్చే వరకూ మహిళల్లో మైగ్రెయిన్ రావడం సహజం. ఏడేళ్లకు ముందు అబ్బాయిల్లో ఎక్కువ శాతం వస్తుంది. ఏడేళ్ల తర్వాత అమ్మాయిల్లో మైగ్రెయిన్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది ఎందుకొస్తుందనేది పూర్తిగా తెలీకున్నా శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం..బ్రెయిన్ స్టెమ్‌లోని మైగ్రెయిన్ ట్రిగ్గర్ సెంటర్ నుంచి వచ్చే నరాలు, ఇతర రక్తనాళాలతో అనుసంధానమై ఉంటాయి. ఇందులో కలిగే రసాయన మార్పుల వల్ల రక్తనాళాలు వ్యాకోచించడంతో తలనొప్పి వస్తుంది. మైగ్రెయిన్ వచ్చినప్పుడు తలనొప్పి వస్తుంది. తరువాత వాంతులు అవుతాయి. కొంత మందికి కాకపోవచ్చు. చూపు తెరలు తెరలుగా కనిపిస్తుంది. 72 గంటల కంటే ఎక్కువగా మైగ్రెయిన్ ఉంటే స్టేటస్ మైగ్రెయిన్ అంటారు. ఆ రోగికి వెంటనే చికిత్స చేయాలి. ఆలస్యం చేస్తే పక్షవాతం వచ్చే అవకాశం ఉంది. మైగ్రెయిన్ ఒక స్పెక్ట్రమ్ లాంటిది. డిప్రెషన్, యాంగ్జైటీ ఉండే వాళ్లకు ఇది రావొచ్చు. మైగ్రెయిన్ వల్ల డిప్రెషన్, యాంగ్జైటీ రావొచ్చు. మైగ్రెయిన్ ఉండే వాళ్లకు బిపి, గుండె జబ్బులు వచ్చే అవకాశం చాలా ఎక్కువగా ఉంటాయి. చిన్న పిల్లల్లో ఏ కారణం లేకుండా వాంతులవ్వడం, కడుపులో నొప్పి వచ్చిన తర్వాత తలనొప్పి రావడం సాధారణం.

మహిళల్లో అధికమా?

మైగ్రెయిన్‌తో బాధపడేవారిలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువ. 17-44 వయసు మధ్య మహిళల్లో ఇది సాధారణంగా వస్తుంది. ఎందుకంటే ఈ వయసులో హార్మోన్లలో మార్పులు రావడం, సమతుల్యం దెబ్బతినడం వంటివి జరుగుతాయి. 55 ఏళ్ల తరువాత ఈస్ట్రోజన్ హార్మోన్ స్థాయి తగ్గడం వల్ల మైగ్రెయిన్ క్రమంగా తగ్గుతుంది.

సిటి స్కాన్ అందరికీ అవసరమా!

రోగి చెప్పే లక్షణాలను బట్టే మైగ్రెయిన్ ఉందో లేదో డాక్టర్ నిర్ధారిస్తారు. అయితే రోగికి మైగ్రెయిన్ లక్షణాలు లేకుండా తలనొప్పి వచ్చే వారికి, చేతుల్లో, కాళ్లల్లో తిమ్మిర్లు వచ్చే వారికి సిటి స్కాన్ చేయాల్సి ఉంటుంది. 50 ఏళ్లు పైబడిన వారికి తలనొప్పి ఉంటే సిటి స్కాన్ చేయడం మంచిది. ఇంతకు ముందు మైగ్రెయిన్ ఉన్న వాళ్లకు ఒక్కసారిగా తీవ్రమైన తలనొప్పి రావడం, మందులు వేసుకున్నా తగ్గకపోవడం, గర్భనిరోధక మందులు వాడుతున్న మహిళలకు తలనొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తే స్కానింగ్ చేయాలి.

నివారించొచ్చు

వ్యక్తిగత జీవితాలనే కాక దేశ ఉత్పాదకతపై ప్రతికూల ప్రభావం చూపుతున్న మైగ్రెయిన్‌ను పూర్తిగా నివారించొచ్చు. ఇందుకు కావాల్సిందల్లా సంకల్పమే. ఎందుకంటే జీవనశైలిని మార్చుకోవడం వల్ల చాలా వరకు మైగ్రెయిన్‌ను నివారించొచ్చు.

చికిత్స

మైగ్రెయిన్‌తోపాటు అధికరక్తపోటు, డిప్రెషన్, యాంగ్జైటీలకు వాడే మందుల్లో మైగ్రెయిన్‌కు పనికొచ్చే మందులను తీసుకోవాలి. అధిక రక్తపోటు ఉంటే తగ్గించుకోవాలి. ఏ మందుల వల్ల వస్తుందో వాటిని తగ్గించుకోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. నిద్రపోవాలి. నీళ్లు ఎక్కువ తాగాలి. ఎక్కువగా పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్ల వల్ల కూడా ఇది వచ్చే అవకాశం ఉంది. మైగ్రెయిన్ రావడానికి ధ్వని కాలుష్యం ఒక కారణం. దీనికి దూరంగా ఉండాలి. ఎండలో ఎక్కువగా వుండకూడదు. చలువ కళ్లద్దాలు వాడాలి. నెలకు ఒకటి, రెండు సార్లు తలనొప్పి వస్తే డాక్టర్‌ను సంప్రదించి పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్‌తో తగ్గించుకోవచ్చు. అలా కాకుండా నెలకు మూడుసార్ల కన్నా ఎక్కువగా వస్తే మందులతో చికిత్స చేస్తారు. డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి వంటి మానసిక వ్యాధులతో బాధపడే వారికీ మైగ్రెయిన్ వచ్చే అవకాశముంది. వీరికి బిహేవియరల్ థెరపీ ద్వారా చికిత్స చేస్తారు. రిలాక్సేషన్ ఎక్సర్ సైజ్‌లకు యోగా బాగా ఉపయోగపడుతుంది. దీనివల్ల మానసిక ప్రశాంతత కలుగుతుంది. డాక్టర్ సూచించిన మందులు వాడితే మైగ్రెయిన్ తలనొప్పి తగ్గుతుంది. తగ్గిందని మందులను అకస్మాత్తుగా ఆపకూడదు. ఇలా చేస్తే మళ్లీ తలనొప్పి తీవ్రమయ్యే అవకాశముంది. డాక్టర్ సలహా ప్రకారం మందులను ఆపాలి. మెల్లగా డోసు తగ్గించాలి.

★

కారణాలు

- జన్యుపరమైన కారణాల వల్ల కొంత మందికి మైగ్రెయిన్ వచ్చే గుణం ఉంటుంది.
- తలకు దెబ్బతగిలిన వారికి కొంత కాలానికి తలనొప్పి రావచ్చు.
- వేళకు భోజనం చేయకపోవడం, నిద్ర సరిగ్గా లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం వల్ల రావచ్చు.
- కొంత మందికి ఎండలోకెళ్తే తలనొప్పి వస్తుంది.
- ఎక్కువగా అలసిపోయినా, టెన్షన్ ఎక్కువగా వున్నా, ఆల్కహాల్ తాగేవాళ్లకు మైగ్రెయిన్ వచ్చే అవకావశం ఉంది.
- కొంత మందికి వాతావరణం మారడం వల్లా ఇది వస్తుంది.
- కొన్ని రకాల మందులు తీసుకోవడం వల్ల వస్తుంది.
- కొన్ని వాసనలు, రకాల ఆహార పదార్థాలు పడకపోవడం వల్లనూ వస్తుంది.
- కంప్యూటర్ ముందు ఎక్కువసేపు పనిచేయడం, ఆందోళనతో ఉండడం వల్లనూ వస్తుంది.



విజ్ఞాన వీచిక

మండే కాలం
కారణం మనమే!



భూగ్రహంపై జీవం ఆవిర్భవించడానికి కారణం - ఒక కారణం-వెచ్చదనం. అంటే ఇతర గ్రహాలపై లాగా విపరీతమైన వేడిగానీ, అస్సలు వేడి లేకపోవడంగానీ కాకుండా వెచ్చగా వుండటం జీవావిర్భవానికి సానుకూలంగా మారింది. కానీ ఈ వెచ్చదనం కాస్తా కరకు వేడిగా మారుతోంది. ఏ ఏటికాయేడు పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలే అందుకు నిదర్శనం. వాస్తవానికి భూమి సూర్యుడికి కాస్త దగ్గరగా చేరితే ఆ మూడు-నాలుగు నెలల కాలం ఆ అర్ధగోళంపై వేసవి అవుతుంది. కానీ ఈ పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు కారణం భూమి సూర్యుడికి మరింత చేరువవ్వడం కాదు-మన చేజేతులారా చేసుకున్న పాపమే!

-కాకర్లమూడి విజయ్

ప్రతి పగలూ భూమిపైన వేడి రాత్రీ చల్లబరుస్తుంది. కానీ కార్బన్‌డయాక్సైడ్ వాయువు ఒక గాజు దుప్పటిలా పనిచేసి, వేడిని రాత్రివేళలో కూడా (సూర్యకాంతి లేనపుడు) అట్టే పెడుతుంది. ఈ ప్రక్రియని హరితగృహ ప్రభావం అంటారు. ఈ మధ్య కాలంలో కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలో అధికమై మరింత దళసరి దుప్పటిలా మారి, మరింత వేడిని ఆపేస్తుంది. అలా భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయన్నది సర్వవిదితమే.

భూమి నిప్పుల కొలిమిలా మారడానికి మన వంతు పాత్ర ఎంతుందీ అని బేరీజు వేసుకోవడం కంటే అసలు మన పాత్ర వల్లే అలా తయారయ్యింది అనడం సబబు. ప్రకృతి ఎప్పుడూ ఏదో ఒక రకమైన సమతుల్యతను పాటిస్తూనే వుంటుంది. స్వతహాగా ఒకవేళ ఏదైనా అధికమైతే దానిని మరో రకంగా తగ్గించే ప్రయత్నం కూడా చేస్తుంది. కానీ, అటువంటి బృహత్తర సమతౌల్యాన్ని మనం దెబ్బతీశాం. మనమే చేశాం అని ఆశ్చర్యపోనవసరం లేదు.

భూమి పైనుండి పచ్చదనాన్ని తీవ్రంగా తగ్గించేశాం. ప్రస్తుతం ఏ చిన్న పట్టణమైనా ఏదో ఒక రకంగా అభివృద్ధిని సాధిస్తోంది. తద్వారా ఆయా ప్రాంతాలలోకి జనం వలసలు అధికమౌతున్నాయి. అధికమైన జనాభాల అవసరం నిమిత్తం బలౌతున్నది ప్రకృతే. వారి నివాసాల కోసం స్థలం కావాలి. అందుకోసం చెరువులు, కుంటలు, పచ్చిక బయళ్ళు, కొండలు, గుట్టలు, కాల్వలు చివరికి పంటపొలాలు, స్మశానాలను కూడా వదలకుండా నిర్మాణాలకి వినియోగించుకుంటున్నాం. ఆ క్రమంలో ఒక పక్క ఎన్నో ఏళ్లుగా పెరిగిన వృక్షాలను నిర్మూలించడంతో పాటు మరో పక్క కాంక్రీటు నిర్మాణాలు చేపడుతున్నాం. కాంక్రీటుతో సమస్య ఏమిటంటే- చెక్కలా అది వేడిని నిక్షిప్తం చేసుకోదు. వదిలేస్తుంది. అంటే ఉదయపు వేడిని చెట్లు పీల్చుకుని చుట్టుపక్కల చల్లగా వుంచుతాయి. అయితే వాటి స్థానంలో వెలిసిన కాంక్రీటు కట్టడాలు పగలు పీల్చిన వేడిని పగలూ, రాత్రి కూడా విడుదల చేస్తున్నాయి - బండరాళ్లలా. అటువంటి రేడియేషన్ వల్ల అసలు సూర్యరశ్మి వేడికన్నా ఎక్కువ వేడిని అనుభవించాల్సిన అగత్యం ఏర్పడుతున్నది. సరే- నిర్మాణాలు వుంటే సరిపోదు కదా. రోడ్లు కావాలి. నల్లటి తారురోడ్లు, లేదా సిమెంటు కాంక్రీటు రోడ్లు తయారౌతాయి. వాటిపై గుంతల సంగతి ప్రస్తుతానికి వదిలేద్దాం. కానీ అవి ఎంత వేడిని రేడియేట్ చేసి మరింత తీవ్రతరం చేస్తాయన్నది మనందరికీ అనుభవమే.

ఇక వీటికి తోడు వాహనాలు, అవి వదిలే వాయువులు. విలాసాలు నడుస్తున్నంత సేపూ వాటి నుండి వచ్చే వాయువులు (కాలుష్యం విషయం కూడా ప్రస్తుతం ప్రస్తావించకుండా ఆపుదాం) వేడిని పెంచుతున్నాయి.

మరి ఇన్ని రకాలుగా మన చేతులారా



రూపొందించుకుంటున్నామంటే ఎవరిని తప్పుపట్టగలం?

ఇలా నిత్యం మండుతున్నది మన రాష్ట్రం మాత్రమే కాదు. చాలా ప్రదేశాలలో ఈ ప్రభావం ప్రబలుతోంది. తెలిసో, తెలియకో ప్రజల కారణంగా పెరుగుతున్న వేడి వల్ల బలయ్యేది ప్రజలే. వృద్ధులు, పిల్లలు, బలహీనులు ప్రాణాలే కోల్పోతున్నారు. అంతటి వేడి గాలులు పట్టణాలు, నగరాలు, చివరకు గ్రామాలలో కూడా వీస్తూ ఎడారులను తలపిస్తున్నాయి. ఎడారుల్లో పగళ్ళు సెగళ్లలా వున్నా రాత్రులు చాలా చల్లబడతాయి. మనకా అదృష్టం కూడా లేకుండా పోయింది.

మన రాష్ట్రం అంతటా పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు అటూ ఇటూగా వుంటున్నాయి. అంటే రాష్ట్రమంతటా చెట్లు లేవా, అన్నీ కాంక్రీటు కట్టడాలేనా? అనే ప్రశ్న వస్తే కాదు. చాలా చోట్ల పచ్చదనం బావుంది. సమృద్ధిగా కూడా వుంది. కానీ ప్రకృతిలో గొలుసు కట్టు చర్యలు జరుగుతుంటాయి. మీ పొలంలో క్రిమినాశకాలు వెదజల్లితే రాబోయే వసంతాలలో కోయిల పాటలుండవు అంది 'సైలెంట్ స్ప్రింగ్' (మౌన వసంతం) అనే గ్రంథ రచయిత్రి రేచల్ కార్సన్.

ప్రకృతిలోని ఆహార గొలుసుల ద్వారా విషపదార్థాలు ఒక్కో పైస్థాయికీ పెరుగుతూ పోయి చివరికి పక్షులను మట్టుబెడతాయని ఆవిడ 47 ఏళ్ల క్రితమే హెచ్చరించింది. అలాగే పట్టణాలలో వేడి పక్కనే వున్న పల్లెలనూ ప్రభావితం చేస్తుంది. ఎక్కడో వున్న పచ్చదనాన్నీ కబళిస్తుంది.

మన రాష్ట్రంలో ఇప్పుడు ఉత్తర భారతం నుండి వేడిగాలులూ, అరేబియా సముద్రం పైనుండి పీడన ప్రభావమూ అధికంగా వుంది. ఆ గాలులు మన ప్రకృతి విరుద్ధ చర్యలతో మరింత ప్రభావం చూపడం ప్రారంభించాయి.

కొన్ని ప్రాంతాలు స్వతహాగా బాగా వేడిగా వుంటాయి. ఖమ్మంలోని కొత్తగూడెం, గుంటూరులోని రెంటచింతల ప్రాంతాలు సాధారణంగా మిగతా ప్రాంతాలకంటే అధిక ఉష్ణోగ్రత నమోదు చేసుకుంటాయి. అందుకు కారణం వాటిలోని బొగ్గుగనులూ, సున్నపురాళ్ల నిల్వలూ. ఆ ప్రాంతాలలో ఈ ఏడు 50 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. హైదరాబాదులో కూడా మునుపెన్నడూ లేని విధంగా ఉక్కపోత, చెమట పట్టడం విశేషం. అందుకు కారణం వాతావరణంలోని తేమ. వాతావరణంలో సరిపడా తేమ వుంటే ఉష్ణోగ్రతల ప్రభావం అంతగా తెలియదు. తేమ బాగా ఎక్కువగా వుండే తీరప్రాంతాలలో ఒక సమస్య అయితే విపరీతమైన పొడి గాలులతో మరేంచేయాలి? ఇప్పుడు చేయగలిగింది. మన తెలివి తక్కువతనానికి శిక్ష అనుభవించడమే అంటున్నారు శ్రీకాంత్. ఒక కాలేజీలో అధ్యాపకుడైన ఆయన "మనల్ని మనమే హింసించుకుంటున్నాం. అనాలోచితంగా ప్రవర్తిస్తున్నాం. అందుకు ఫలితంగా ఈ మాత్రం శిక్షకు అర్హులం కామా?" అని ప్రశ్నిస్తున్నారు.

సాయంకాలాలు పార్కులో సేదదీరే రాజేశ్వరరావు గారు "ప్లాటులు కడుతూ గదుల లెక్కలూ, కింద పార్కింగు లెక్కలూ, వాస్తూ వంటివన్నీ చూస్తారు. గానీ ఎవరైనా మొక్కలకీ, చెట్లకీ వీలు కల్పిస్తున్నారా? అటువంటి ప్లాట్లలో వాళ్ళు సహజ వెలుతురుకీ, గాలికీ దూరమౌతున్నారు. పైగా కనీసం వెంటిలేటర్లు కూడా లేకుండా, కిటికీలు కూడా తీయకుండా ఏసీలు పెట్టుకుంటారు. అలా వాళ్ళకి చల్లగానే వుంటుంది. కానీ ఏసీల వల్ల ఎంత వేడి బయటికి వస్తుంది? ఎంత కాలుష్యం ఏర్పడుతుంది?" అంటూ ఆవేశపడ్డారు.

నిజమే! కానీ ఎవరైనా ఇవన్నీ పట్టించుకున్నారా? ఇకపై పట్టించుకుంటారా? తిట్టుకుంటూ అయినా సరే చీకట్లోనే వుంటాం గానీ ప్రయత్నించి వెలుగు కోసం వెదకం. హరితగృహ ప్రభావం అంటే నేనా కారణమంటాం. ఓ పొర పల్చబడిందంటే అదెక్కడో ఆస్ట్రేలియా పైనంటాం. కార్బన్ వాయువులు పెరిగాయంటే మనకేంటి సంబంధం అంటాం. వేసవి వస్తే పొలోమని విహారయాత్రలకోసం వేసవి విడుదులను అన్వేషిస్తూ పోతాం గానీ మన చుట్టుపక్కల పచ్చదనాన్ని పెంచామా? ఏ మాత్రం 'పెరడు' అనే స్థలం లేకుండా పక్కింటి గోడనానుకుని మనగోడ కట్టుకుంటూ, సహజమైన గాలీ వెలుతురూ ఇంట్లోకి తెచ్చే ప్రయత్నం చేశామా?

ఇది మన ఒక్కరి పరిస్థితి కాదు. రాష్ట్రాలు, దేశాలు, ఖండాలూ ఇదే వ్యవహార శైలిలో నడుస్తున్నాయి. తప్పు నాది కాదంటే నాది కాదంటూ తప్పించుకోజూస్తున్నాయి.

ఇప్పటికే పరిస్థితి మన చేయి దాటి పోయింది. అది మున్ముందు మరింత తీవ్రమౌతుంది. ప్రకృతితో సహజీవనమే సౌకర్యం. ఏనాడైతే ప్రకృతి గుండె కోశామో అప్పుడు అది కన్నెర చేసింది. అసలు వేడి తప్ప మరో ఋతువు లేని పరిస్థితి వస్తే!? రానీయకుండా ప్రయత్నం చేయాలి. విస్తృతంగా వనాలను అభివృద్ధి చేయాలి. నెక్లెస్ రోడ్లూ, రింగ్‌రోడ్లతో బాటు హరిత హారాల్ని ఏర్పరచాలి. 'మన' అభివృద్ధితో పాటు ప్రకృతిని కూడా అభివృద్ధి పరిస్తే కాస్తలో కాస్తయినా ఊరట కలిగించే భవిష్యత్తు మనకి, మన వారసులకి లభిస్తుంది. అటువంటి పరిస్థితి రానంతవరకూ నిప్పుల కొలిమిలో జీవనం సాగిస్తూనే వుండాలి.

★

ఎండలు తగ్గేవరకూ....

- మొక్కలు, చెట్లు, నీళ్ళు-ఇవే సహజంగా చల్లదనాన్ని ఇచ్చేవి.
- లోపలికి గాలి చొరబడకుండా అన్నీ మూసి ఏసీలు వేసేకంటే తలుపులకీ, కిటికీలకీ వట్టివేళ్ల తెరలు కట్టి వాటిని తడిపితే లోపల గాలి చల్లబడుతుంది.
- ఉదయం 10-11 నుండి సాయంత్రం 4-5 వరకు ఎండ తీవ్రత (యు.వి కిరణాల మూలంగా) అధికంగా వుంటుంది. అందుకని తేలిక వస్త్రాలు, దుస్తులూ ధరించాలి.
- కళ్ళజోళ్ళూ, టోపీలు, గొడుగులూ, ముసుగులూ... ఏదోలా వేడి నుండి రక్షణ కల్పించుకోవాలి.
- నీరు బాగా తాగుతుండాలి. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, రుచిగా చేసిన పండ్ల రసాలూ సేవించాలి.
- డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉప్పు, పంచదార కలిపిన నీళ్లు తాగుతుండాలి.



ఫ్రెండ్ ఎక్కడ?

హాయ్... మనమంతా ఫ్రెండ్స్ కదా! ఇంగ్లీషులో ఫ్రెండ్ స్పెల్లింగ్ పైనున్న బొమ్మలో దాగుంది. ఒక్కో అక్షరాన్ని వెతికి వాటన్నింటిని కలిపేయండి.



పదబంధం

పిల్లలూ మీకు పజిల్ పూర్తి చేయడమంటే చాలా ఇష్టమా? పక్కనే ఉన్న బొమ్మలను ఇంగ్లీషులో ఏమంటారో ఆ పదాలను ఈ ఖాళీ గళ్లతో అడ్డంగా రాసి చకచకా పూర్తి చేయండి. అన్నీ పూర్తయిన తర్వాత నిలువు మధ్య వరుసలో కూడా ఒక పదం వస్తుంది. అదేమంటే మనం దూరంగా వున్న చిన్న చిన్న వస్తువులను దీని ద్వారానే చూస్తాము.

కొత్త పదాలు రాద్దామా...

హాలో పిల్లలూ...మీకు ఇంగ్లీషు బాగా వచ్చంట కదా. మరైతే GRAPE నుంచి PEACH రాయగలరా? అరే మరీ అంత అమాయకంగా మొహం పెట్టకండర్రా. ముందు గ్రేప్‌లో ఒక్క అక్షరం మార్చితే మరో కొత్త పదం వస్తుంది. అందులో మరో అక్షరం మార్చితే ఇంకో పదం వస్తుంది. pear నుండి plum వచ్చింది కదా. అలా GRAPE నుంచి PEACH రాయగలగాలి. అయినా మీకిదో లెక్కా...! తెలీకపోతే మాత్రం జవాబు చూడండి.



9తో 10 ఎలా?

పిల్లలూ... తొమ్మిది అగ్గిపుల్లలతో పది ఎలా చేయాలో తెలుసా? అయితే ఒక్క అగ్గిపుల్లని కూడా తుంచకూడదు.





తప్పులెన్నో?

పిల్లలూ పల్లెటూరి వాతావరణం బావుంటుంది కదా! సర్సరి అసలు విషయానికొద్దాం. ఈ బొమ్మలో కొన్ని తప్పులున్నాయ్. అంటే... కొన్ని వుండవలసిన చోట కాకుండా మరెక్కడో వున్నాయి. అవేంటో కనిపెట్టండి.



బొమ్మ పెన్సిల్

హాయ్ ఫ్రెండ్స్! కొద్దిరోజుల్లో మళ్లీ స్కూళ్లు తెరుస్తారు కదా. మరి పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు వంటివన్నీ రెడీ చేసుకుంటున్నారా? పెన్సిళ్లంటే గుర్తొచ్చింది. మనకి రకరకాల బొమ్మలున్న పెన్సిళ్లు షాపుల్లో దొరుకుతాయి. కానీ అటువంటి పెన్సిల్‌ని మనమే మన స్నేహస్తాలతో ఇంట్లో తయారు చేసుకుంటే... ఎలా వుంటుంది. చాలా ఆనందంగా వుంటుంది కదా. మరి తయారు చేద్దామా...

ఏమేం కావాలంటే..

కత్తెర, స్కేలు, పెన్సిల్, ఒక ఇంచ్ వెడల్పున్న చిన్న బొమ్మ, మందపాటి ముఖమల్ బట్ట, ఫెవికాల్

ఎలా చేయాలంటే...

ముందుగా మందపాటి ముఖమల్ క్లాత్ తీసుకోండి. దాన్ని అరంగుళం వెడల్పు, ఏడంగుళాల పొడవు ఉండేట్లుగా కత్తిరించుకోవాలి. దానికి మధ్యలో ఆరు చోట్ల సమాన దూరాల్లో పెన్సిల్ పట్టే రంధ్రం చేసుకోవాలి. ఇలా కత్తిరించుకున్న ముఖమల్‌క్లాత్‌కి ఒక చివర చిన్న బొమ్మను ఫెవికాల్‌తో అతికించుకుని బాగా ఆరనివ్వాలి. తర్వాత దీనికి ఉన్న రంధ్రాల్లో పెన్సిల్‌ని దూర్చితే సరి. అంతే . అందమైన పెన్సిల్ తయారైంది చూశారా. దీన్ని మీ నేస్తాలకు బహూకరించి చూడండి. ఎంత సంతోషపడతారో.

పై వారం మరో క్రాఫ్ట్ గురించి చెప్పకుందాం. మరి ఎదురుచూస్తుంటారుగా.

నే
ర్చు
కుం
దాం



నింపండి చకచకా!

హాయ్ ఫ్రెండ్స్... 4 నుండి 9 అంకెలను ఉపయోగించి ఈ బాక్సును నింపాలి. అయితే ఈ అంకెలను అడ్డంగా కూడినా, నిలువుగా కూడినా ప్రతి వరుసలోని అంకెల మొత్తం 18 రావాలి. ఓకేనా! మరైతే మొదలెట్టండీ.

జవాబులు

ఎలా చేస్తారో :

తప్పులెన్నో? :

ఇంటి మధ్యలో చెట్టు, పొగ గొట్టం, అమ్మాయి నెత్తిమీద బోర్లించిన నీళ్ల కుండ, తలకిందులుగా ఉన్న పక్షి, బండి లాగుతున్న మనిషి కాళ్లు, తల పాగా, నీళ్ల బక్కెట్ హ్యాండిల్.

కొత్త పదాలు రాద్దామా...:

GRAPE, GRACE,
GLACE, PLACE,
PEACE, PEACH.

తొమ్మిదితో పది ఎలా? :



చకచకా నింపండి:

అట్టమీది కథ

మళ్లీ మన్మోహనీయం



భారత దేశ ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంలో వ్యక్తిగతంగానూ రాజకీయంగానూ అనేక ప్రత్యేకతలు గోచరిస్తాయి. ఇవి కేవలం ఆసక్తి కరమైనవే కాదు, లోతుగా ఆలోచించ వలసినవి కూడా. ఈ విధమైన రాజకీయ నేపథ్యంలో ఇలాంటి నాయకుడు అత్యున్నత అధికార పీఠం అలంకరించడం ఇది వరలో జరగలేదు. మన్మోహన్ వ్యక్తిగత విలక్షణతతో పాటు దేశ రాజకీయ ఆర్థిక జీవనంలో వచ్చిన కొత్త పరిణామాలు కూడా ఇందులో అగుపిస్తాయి. ఇంకా చెప్పాలంటే ప్రపంచీకృత ఆర్థిక ఆధిపత్య శక్తులు వేళ్లూనుకుపోతున్న సంకేతాలు ఇందులో స్పష్టమవుతాయి. అదే సమయంలో అంతర్గతంగా కాంగ్రెస్‌లో వచ్చిన నూతన మార్పుకూ మన్మోహన్ అభ్యర్థిత్వం అద్దం పడుతుంది.

- తెలకపల్లి రవి

నెహ్రూ, ఇందిరాగాంధీల తర్వాత బిజెపి నాయకుడు వాజ్‌పేయి ఒక్కరే ప్రధాని పదవిలో వుండి ఎన్నికలను ఎదుర్కొని విజయం సాధించగలిగారు.అయితే 1998లో మలి సారి ఆయన ప్రధాన మంత్రిత్వం ఏడాదిలోనే ముగిసిందని కూడా గుర్తుంచుకోవాలి. కాని మన్మోహన్ అయిదేళ్ల పూర్తి కాలం పదవిలో వుండి మరోసారి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సారి ఆయన పదవీ కాలం ఎంతో చూడవలసిన విషయమే అయినా ఇక్కడికిదే ఒక విశేషం. ఆయన బలహీనమైన ప్రధాని అని బిజెపి నాయకుడు ఎల్.కె. అద్వానీ పదే పదే నోరు పారేసుకున్నారు. తనతో చర్చకు రావలసిందిగా సవాళ్లు విసిరారు.వీటికి మన్మోహన్ కూడా దీటుగానే స్పందించారు. మరోవంక ఆయన నాయకత్వంలోని యుపిఎ భాగస్వాములైన శరద్ పవార్ వంటివారు కూడా ప్రధాని పదవిపై ఆకాంక్షలు వెలిబుచ్చారు. మరో వైపున వీర ఇందిరా భక్తులు రాహుల్ గాంధీ రాజ్యాభిషేకం గురించి రాగాలాపన చేశారు.

ఇన్నిటి మధ్యనా సర్దార్జీ మాత్రం అలవాటైన మిత భాషిత్వంతోనే సమాధానమిస్తూ వచ్చారు. కాంగ్రెస్ నాయకులు మన్మోహన్ ప్రధాన మంత్రిత్వం కూడా ఒక ప్రధానాంశంగా ప్రచారం చేశారు. ఆయన పరిపాలనా పటిమ, ఆర్థిక శాస్త్ర కౌశలం వంటివాటి గురించి గొప్పగా చెప్పారు. ఇది కూడా గతంలో జరగని విషయం.

కుబేరుల హర్షాతిరేకం....

కాంగ్రెస్ పార్టీకి సోనియా గాంధీ అత్యున్నత నాయకురాలు. అన్నీ ఆమె నిర్ణయానుసారమే జరుగుతాయి. మన్మోహన్ ప్రభుత్వాధినేత అయినప్పటికీ నిర్ణయాధికారం తక్కువన్నది తెలిసిన విషయమే.ఆయన మౌలికంగా సాంకేతిక నిపుణుడి వంటి వారు. అంటే టెక్నోక్రాట్. అర్థశాస్త్రంలో ఆయన పాండిత్యం దేశ విదేశీ గుత్తాధిపతులు ప్రయోజనాల పరిరక్షణకు గొప్పగా సరిపోతుంది. అందుకే వారు ఆయనను కోరుకుంటారు. మరోసారి ఆయన ప్రధాని అవుతున్నాడని వార్తలు రాగానే స్టాక్ మార్కెట్ పరవళ్లు తొక్కడం ఇందుకు నిదర్శనం. అదే గతంలో వామపక్షాల మద్దతు కావలసి వస్తుందనగానే ఇదే స్టాక్ మార్కెట్‌లో ప్రకంపనాలు కనిపించిన సంగతి అందరికీ గుర్తుంటుంది. ఈ పరవళ్లకూ పారవశ్యాలకూ మూలం స ంపన్న వర్గాల మాయాజాలమే. వారికి ఇష్టుడు కావడం ఆయన ప్రధాన అర్హత.

ఉదారవాద విధానాలు, నూతన ఆర్థిక విధానాలు, ఆర్థిక సంస్కరణలు,సరళీకరణ వగైరా రకరకాల పేర్లతో ప్రాచుర్యంలోకి వచ్చిన వాటి మూల పురుషుడు మన్మోహనుడే. 1991లో పివి నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఆయనే వీటికి శ్రీకారం చుట్టాడు.(జీవిత విశేషాలకు బాక్సు చూడండి) అందుకే వాటిని మన్మోహనామిక్స్ అని కూడా అంటుంటారు. ధనాఢ్య వర్గాలకు ఆయన ఇంతటి మన్మోహనుడు కావడానికి కారణమూ అదే. ఇదే ఆయనను అనూహ్యంగా ప్రధాని స్థానంలో ప్రతిష్టించింది. చరిత్రను పరిశీలిస్తే 1984 ప్రధాని పీఠం కోసం ఆరాటపడిన వారు, ఘటికులుగా పేరు తెచ్చుకున్న వారు అనేకులు చతికిల పడగా కథల్లో వలె దానికి దూరంగా వుండి పోయి దుర్బలులని ముద్ర వేసుకున్నవారినే పదవి వరించడం చాలా సార్లు చూస్తాం (బాక్సు చూడండి) మన్మోహన్ కథ కూడా అలాటిదే.

ప్రధాని పరంపర

1977లో ఎమర్జన్సీ కారణంగా ప్రజల తిరస్కృతికి గురైన ఇందిరాగాంధీ 1980లో పనిచేసే ప్రభుత్వం నినాదంతో మరోసారి అధికారంలోకి

వచ్చారు.అయితే
ఆ కాలంలోనే దేశంలో సిక్కు తీవ్రవాదం, అస్సాం వేర్పాటు వాదం, కాశ్మీర్‌లో ఇస్లామిక్ తీవ్రవాదం వంటివి ప్రబలాయి.ఆమె అనుసరించిన అస్తవ్యస్త విధానాలు అవకాశవాదాలు కూడా ఇందుకు చాలా వరకూ కారణం. చివరకు అక్టోబరు 30న ఆమె సిక్కు తీవ్రవాది చేతిలో ఘోరంగా హత్య గావించబడ్డారు. ఆ వెంటనే ప్రధాని పదవి చేపట్టిన రాజీవ్ గాంధీ మూడు మాసాల తర్వాత జరిగిన ఎన్నికల్లో సానుభూతి వెల్లువ కారణంగా 400 స్థానాలు గెల్చుకుని ఎన్నడూ లేనంత ఆధిక్యతతో ప్రభుత్వం ఏర్పరిచారు. అయితే ఆరోపణల ఫలితంగా రెండేళ్లలోపునే అస్థిరత్వంలో చిక్కుకుపోయారు.విపిసింగ్ తదితరుల నిష్క్రమణ వల్ల 1889 ఎన్నికల్లో ఓడిపోయారు.190 స్థానాలతో పెద్ద పార్టీగా వచ్చినా ప్రభుత్వం ఏర్పర్చరాదని నిర్ణయించారు. ఆ ఎన్నికల తర్వాత ఏర్పడిన విపిసింగ్ ప్రభుత్వాన్ని ఆయన బిజెపితో కలసి కూలదోసి కొంత కాలం చంద్రశేఖర్ కీలుబొమ్మ నాటకం నడిపించారు. ఆ ప్రహసనం పరిసమాప్తమై 1991లో మధ్యంతర ఎ న్నికలు వచ్చాయి. ఎన్నికల మధ్యలో రాజీవ్ గాంధీని ఎల్‌టిటిఇ మానవబాంబు హత్య చేసిన ఫలితంగా కాంగ్రెస్ మరోసారి సానుభూతి ఓట్లతో అధికారంలోకి వచ్చింది.

పి.వి.నాయకత్వం, కేసరి గడుసుదనం

రాజీవ్ హత్యానంతరం వెనువెంటనే కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీని నాయకత్వం చేపట్టవలసిందిగా కోరారు. అయితే ఆమె తిరస్కరించారు. నెహ్రూ కుటుంబానికి సన్నిహితుడుగా అనేక బాధ్యతలు నిర్వహించిన పి.వి.నరసింహారావుకు ఆ పదవి దక్కింది. ఉత్తరోత్తరా ఆయనే ప్రధాని అయ్యారు అయితే ఆయన హయాంలో రెండేళ్లు గడిచిన తర్వాత సోనియా గాంధీతో సంబంధాలు దెబ్బ తిన్నాయి. నాయకత్వ లక్షణాలు లేని వ్యక్తిగా పేరున్న పివి తనే సర్వాధిపత్యం వహించడానికి విఫల యత్నం చేశారు.సోనియా గాంధీకి అసంతృప్తి ఆగ్రహం కలిగినట్టు కథనాలు వస్తే శాంతపర్చే కొన్ని చర్యలు తీసుకున్నారు గాని పరిస్థితి మారలేదు. చివరకు 1996 ఎన్నికల్లో ఆయన ఓటమిపాలైన తర్వాత కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్ష పదవిలో ఆయనే కొనసాగడానికి సోనియా పరోక్ష సహకారం దోహదపడింది. కాని అంతర్గత రాజకీయాలు కొనసాగాయి. ఆయన రకరకాల కుంభకోణాల్లో చిక్కిన కారణంగా సీతారాం కేసరికి నాయకత్వం అప్పగించి తప్పుకోవలసి వచ్చింది. కేసరి మొదట్లో సోనియా పట్ల వీర విధేయుడుగా వ్యవహరించారు.అన్నిటికీ ఆమె పేరునే ప్రతిపాదిస్తూ కాదన్న తర్వాత తనే పగ్గాలు తిప్పుతూ నాటకం నడిపించారు. అప్పట్లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కాంగ్రెస్ మద్దతుపై ఆధారపడి వున్నందు వల్ల ఆయన ఆటలు బాగానే సాగాయి. 1997తర్వాత సోనియాను ప్రచారంలోకి తీసుకొచ్చారు. కాని మరో వైపున తనే ప్రధాని కావడానికి కూడా పాచికలు వేశారు. ఇవన్నీ గమనిస్తోన్న సోనియా గాంధీ చివరకు తనే నాయకత్వపగ్గాలు చేపట్టారు. 1999లో వాజ్‌పేయి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత ప్రధాని కావడానికి బాహాటంగానే ప్రయత్నించి విఫలమైనారు.1999 ఎన్నికలలో ప్రచార సారథిగా దేశమంతా పర్యటించినా బిజెపి ఎన్‌డిఎ విజయాన్ని నివారించలేకపోయారు. విదేశీ వనిత ప్రధాని కారాదని రాజ్యాంగంలో లేని అభ్యంతరాన్ని బిజెపి లేవనెత్తితే కాంగ్రెస్‌లోనూ శరద్ పవార్ వంటివారు అందిపుచ్చుకుని ఎన్‌సిపి ఏర్పాటు చేశారు.

తొలి పట్టాభిషేకం..

ఈ నేపథ్యంలోనే 2004 ఎన్నికల్లో సోనియా గాంధీ కాంగ్రెస్‌కు సంబంధించిన అన్ని నిర్ణయాల్లోనూ ఖచ్చితంగా తనే బాధ్యత తీసుకున్నారు. ఆమె ప్రధాని కావడానికి దాదాపు రంగం సిద్ధమైంది. అలాంటి తరుణంలో తన బదులు మన్మోహన్ సింగ్‌కు బాధ్యత అప్పగించనున్నట్టు ఆమె ప్రకటించారు. ఇది దేశాన్ని ఆశ్చర్యపర్చడమే కాక కాంగ్రెస్‌లో కలవరం సృష్టించింది. విదేశీ జాతీయతపై వచ్చే వివాదాలను నివారించడంతో పాటు తనకు ప్రత్యక్ష అనుభవంలేదన్న వాస్తవం కూడా ఆమె నిర్ణయం వెనక వుంది. కాంగ్రెస్ పార్లమెంటరీ సమావేశంలో కాంగ్రెస్ నేతలు పోటీపడి మరీ ఆమె భజన చేసినా ప్రధాని పదవి చేపట్టడానికి నిరాకరించారు. చివరకు మన్మోహన్ ప్రధాని అయ్యారు. మిగిలిన అనేక మందితో పోలిస్తే ఆయనకు ప్రత్యక్ష రాజకీయ పాత్ర లేకపోవడం ఇందుకు ప్రధాన కారణం. సహాయకుడుగా వుండి పోవడం తప్ప సారథ్యం గురించిన ఆశలు లేని వ్యక్తి ప్రధాని కావడాన్ని సోనియా గాంధీ కోరుకున్నారు. అంతర్జాతీయ పెట్టుబడిదారుల ఆమోదం వున్న మన్మోహన్ అయితే ఇంటా బయిటా తనకు ధనాఢ్య వర్గాల మద్దతు లభించి పరిపాలన సజావుగా నడుస్తుందన్న వ్యూహం కూడా ఈ ఎంపికలో వుంది. ఆమె అంచనా పూర్తిగా సరైందేనని తర్వాతి పరిణామాలు ధృవపర్చాయి.

వ్యక్తిగా ఆయన నిజాయితీ పరుడా కాదా పెద్ద మనిషి అవునా కాదా వంటి చర్చలు అర్థం లేనివి. ఎప్పుడూ వ్యక్తిగతంగా ఆయనపై ఎవరూ ఏ ఆరోపణా చేయలేదు. అద్వానీ అన్నట్టు బలహీనుడైన వ్యక్తి కూడా కాదు. పైగా ప్రపంచ బ్యాంకు అనుకూల విధానాల అమలులో గాని అమెరికాను అంటకాగడంలో గాని ఆయన చాలా నిక్కచ్చిగా వుంటాడు. అందువల్లనే ఆర్థిక రంగంలో తన విధానాలను వ్యతిరేకించే వామపక్షాలపై ఆధారపడి మనుగడ సాగించడం ఆయనకు చాలా కష్టంగా మారింది. అంతకు ముందు తనే చెప్పిన మాటలను దిగమింగి ఉపాధి హామీ



ప్రపంచ 'బ్యాంకు' నిపుణుడు!

భారత ప్రధానిగా రెండవసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న మన్మోహన్ సింగ్ 1932 సెప్టెంబర్ 26న పంజాబ్‌లోని గా గ్రామంలో పుట్టారు. అదిప్పుడు పాకిస్తాన్‌లో వుంది. దేశ విభజన తర్వాత ఆయన కుటుంబం అమృతసర్ వచ్చింది. పంజాబ్ విశ్వవిద్యాలయంలో అర్థశాస్త్రం అభ్యసించిన మన్మోహన్ కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలలో అనేక ఉన్నత విద్యార్హతలు సంపాదించడమే కాక అంతర్జాతీయ పురస్కారాలు పొందారు. 1962లో అర్థశాస్త్రంలో డాక్టరేట్ పూర్తి చేసి 1966-69 మధ్య ఐరాస వాణిజ్య విభాగమైన అంక్టాండ్‌లో బాధ్యతలు నిర్వహించారు. విదేశీ వాణిజ్య విభాగంలోనూ పనిచేశారు. 1982 నుంచి 1985 మధ్య రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా వున్నారు. అప్పటి కరెన్సీపై ఆయన సంతకాలు చూడొచ్చు.1985 నుంచి 87 వరకూ ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడుగా వున్నారు. ఇందిరాగాంధీ హయాంలో వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలపై అధ్యయనం చేసిన ఆయన ప్రపంచబ్యాంకులో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

1991 లో తొలిసారి పివినరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా చేరిన ఆయన ఉదారవాద విధానాలకు రూపకల్పన చేశారు.1995 నుంచి రాజ్యసభకు ఎన్నికవుతూ వస్తున్నారు.ఎన్‌డిఎ హయాంలో ఆయన రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు.1999లో దక్షిణ ఢిల్లీ నుంచి లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయారు.

2004లో సోనియా గాంధీ ప్రధాని పదవి చేపట్టకూడదని నిర్ణయించుకున్నప్పుడు మన్మోహన్‌ను ఎంపిక చేశారు. ఆ విధంగా 2004 మే 22న ఆయన ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.వామపక్షాల మద్దతు తీసుకున్న కారణంగా అది వరకటి తన విధానాలు కొన్నింటిని తానే అమలు చేయకుండా అటకెక్కించి కొన్ని ప్రజానుకూల శాసనాలు చేశారు. ఈ ఎన్నికల్లో ముందు నుంచే కాంగ్రెస్ ఆయనను ప్రధానిగా ప్రకటించి ప్రచారంలోకి దిగింది. చాలా ఏళ్ల తర్వాత దాని బలం 200 దాటింది గనక ఈసారి మన్మోహన్ భాగస్వామ్య పక్షాల వత్తిళ్లకు లోబడకుండా తను అనుకున్న సరళీకరణ విధానాలు సాగించవచ్చు. అయితే అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం కారణంగా ఆచితూచి అడుగేయడం అనివార్యమే అవుతుంది.

పథకం వంటివాటిని అమలు చేయాల్సి వచ్చింది. విదేశీ పెట్టుబడులను విశృంఖలంగా అనుమతించే విషయంలో వెనక్కు తగ్గాల్సి వచ్చింది. ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడైన మాంటెక్ సింగ్ అహ్లూ వాలియా, ఆర్థిక మంత్రి చిదంబరంలతో కలిస్తే ఈ త్రయం ప్రపంచ బ్యాంకు విధానాలను కలలో కూడా వదలని ఉద్దండ పిండం వంటిది. కాల ప్రభావం కమ్యూనిస్టుల ప్రాభవం వల్ల తలవంచి కాలక్షేపం చేసిన సర్దార్జీ ఆఖరి ఏడాదిలో అమెరికా అనుకూలతను ఏమాత్రం దాచుకోలేక పోయారు. బలపర్చే వామపక్షాలకు మాట మాత్రం చెప్పకుండా అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకుని వచ్చారు. దానిపై విమర్శల తర్వాత సోనియా గాంధీ చర్చలు వగైరాలకు సిద్ధమైనా తను మాత్రం ససేమిరా అని భీష్మించుకున్నారు. అదే గనక అమలు కాకపోతే తను రాజీనామా చేస్తానని ఆయన పదవీ పరిత్యాగానికి కూడా సిద్ధమయ్యాడని

కథనాలు వచ్చాయి.సంకీర్ణ ధర్మం కన్నా, సోనియా విధేయత కన్నా ఆయనకు అమెరికాతో మైత్రి కీలకం కావడం గమనించదగ్గ విషయం.చివరకు ఆ అంశంపైనే వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకున్న తర్వాత సమాజ్‌వాది పార్టీ మద్దతుతో బయటపడ్డారు.

కాంగ్రెస్‌లో పార్టీ అధ్యక్షులు ప్రధాని ఒక్కరే వుండటం ఇందిరా హయాంలో మొదలైంది. నెహ్రూ హయాంలో వేరే అధ్యక్షులు వుండేవారు గాని వారిది ద్వితీయ స్థానమే. ఇందిరా గాంధీ నిలదొక్కుకోవడానికి కొంత కాలం వేరే అధ్యక్షులకు అవకాశం ఇచ్చినా తర్వాత తనే దాన్ని హస్తగతం చేసుకున్నారు. అదే రాజీవ్, పీవీల హయాంలోనూ కొనసాగింది.ఇప్పుడు సోనియా శకంలో అది కొంత అటూ ఇటూ మారింది. పార్టీ అధ్యక్షురాలికి సర్వాధికారం వుండగా ప్రధాని ప్రభుత్వానికి పరిమితమై వుండే పద్ధతి వచ్చింది. 2004-09 మధ్యలో విజయవంతంగా అమలు జరిగిన ఈ వ్యవస్థను కొనసాగించడమే సదుపాయంగా వుందని కాంగ్రెస్ అధిష్టానం(అంటే సోనియా రాహుల్ గాంధీలు,కొంత వరకూ ప్రియాంక , ఆ పైన వారి విశ్వాస పాత్రులైన ప్రముఖులు) భావించిన ఫలితమే మరోసారి మన్మోహన పర్వం.

బేరీజు వేసి చూస్తే ఆయన మంచి పాలకుడు కావచ్చు.మతతత్వ నాయకుడైన అద్వానీ కన్నా మెరుగ్గానూ వుండొచ్చు. అయితే ఆయన

పాలనలో వైఫల్యాలు, సవాళ్లు చాలా తీవ్రంగానే వున్నాయి. ముంబాయి టెర్రరిస్టు దాడి దానికి పరాకాష్ఠ. వామపక్షాల పుణ్యాన ఆర్థిక మాంద్యం దెబ్బ తప్పించుకున్నా ఆ ప్రమాదం వుండనే వుంటుంది. అమెరికాతో వ్యూహాత్మక మైత్రికి మనం సిద్ధపడిన ఫలితాన్ని కూడా భరించవలసి వుంటుంది. ఇప్పటికే పాకిస్తాన్‌లో తాలిబాన్లపై దాడి పేరిట అమెరికా ప్రత్యక్ష జోక్యానికి సిద్ధమైంది. దేశంలోనూ తృతీయ కూటమిలో వామపక్షాల ప్రాధాన్యతను అడ్డుకోవడానికి అమెరికా రాయబారి నేరుగా తలదూర్చడం చూశాము.ఓడిపోయిన బిజెపి నేతలు మరోసారి హిందూత్వ హింసానలం రగిలించడానికి సిద్ధం కావచ్చు. బెంగాల్‌లో మమతా బెనర్జీ వంటివారి రాజకీయ ఆధిక్యత ఉద్రిక్తతలకు దారి తీసే ప్రమాదం కూడా వుంది.వారికి మంత్రివర్గంలో చోటు కల్పించే మన్మోహన్ వారి అదరగణ్ణం పోకడలను ఎలా అడ్డుకుంటారన్నది పెద్ద ప్రశ్న. లేకపోతే శాంతి భద్రతల సమస్యలు తీవ్రమవుతాయి.



నిర్ణయాలపై సోనియా ముద్ర వున్నా ప్రధానిగా మన్మోహన్ కీలక ప్రభావాన్ని తగ్గించి చూడడం పొరబాటు. రాజ్యాంగ రీత్యా ప్రధానికి విస్తృతమైన అధికారాలు వున్నాయి. దేశంలో పరిపాలనకు ప్రతీక ఆ స్థానమే. దేశ విదేశ వ్యవహారాలలో ఏదీ ఆయన/ఆమె ఆమోదం లేకుండా జరగడానికి లేదు. రాష్ట్రాలతో సంబంధాల సరళిని కూడా ప్రధాని వైఖరే నిర్ణయిస్తుంది.సంకీర్ణ యుగంలో స్వంతం బలం చాలక ఇతరులపై ఆధారపడే స్థితి ప్రధానుల కాళ్లూ చేతులూ కట్టివేసిన ఉదాహరణలు గతంలో వున్నాయి. కాని ఇప్పుడు కాంగ్రెస్‌కే 200 స్థానాల వరకూ వున్నందున ప్రస్తుత ప్రధాని దృఢంగా వ్యవహరించే అవకాశాలు చాలా వున్నాయి.

రాహుల్‌కు స్వాగతం పలికి....

అనేక సంపన్న దేశాలలో రాజకీయవేత్తలు కాక వృత్తినిపుణులు కీలక స్థానాలు చేపట్టడం పెరుగుతున్నది. పారిశ్రామికవేత్తల రాజకీయ ప్రవేశం కూడా బాగా పెరిగింది. ప్రస్తుత పార్లమెంటులో అలాంటి వారు వందల సంఖ్యలో వున్నారు. అలాంటి అగ్రశ్రేణిలో మన రాష్ట్రానికి చెందినవారూ నలుగురున్నారు. మన్మోహన్ సింగ్ వంటి వారి ఎంపిక ఈ పోకడలో భాగమే. పైగా ఈ సారి ఆయనతో పాటు రాహుల్ గాంధీ పేరు కూడా పదే పదే వినిపించింది. విజయం సాధించిన తర్వాత ఆయన స్వయంగా రాహుల్‌ను కేంద్ర మంత్రి వర్గంలో చేరవలసిందిగా ఆహ్వానించారు. పైగా ఒప్పిస్తానని కూడా చెప్పారు. ఈ ప్రకటనలోనే ఆయన ప్రతిపత్తి చాలా వరకూ తెలుస్తుంది. గతంలో లాల్ బహుదూర్ మంత్రివర్గంలో ఇందిరాగాంధీ కూడా ఇలాగే అప్రెంటిస్ చేశారు. రెండవ పర్యాయం మన్మోహన్ పదవి చేపట్టడం రాహుల్‌కు మార్గం సుగమం చేయడానికేనన్న భావన సర్వత్రా నెలకొని వుంది. రాహుల్ ఒకనాటికి ప్రధాని అవుతాడని ప్రియాంక వ్యాఖ్యానం కూడా చేశారు. ఇంకా అనుభవం చాలదని రాహుల్ అన్నారు. సోనియా గాంధీ కూడా ఈ భావనతోనే తను పదవిచేపట్టకుండా అత్యంత విశ్వసనీయుడు, విశ్వాస పాత్రుడైన మన్మోహన్‌ను కూర్చోబెట్టారన్న భావన వుంది. అది నిజమేనని ప్రస్తుత పరిణామాలు వెల్లడిస్తున్నాయి.. యువరాజ పట్టాభిషేకం ఖాయమైన తర్వాత వృద్ధ రాజు దిగిపోయే ముహూర్తంపైనే అందరి కళ్లూ వుండటం సహజం. వెనువెంటనే జరక్కపోయినా తర్వాత జరిగేది జరిపించేది అదే!

★

కోరిన వారిని చేరదా?

భారత దేశ ప్రధాన మంత్రి పదవి అత్యంత శక్తివంతమైంది. అయితే ఆ పదవి చేపట్టే శక్తి తమకుందని భావించి భంగపడిన వారు చాలా మంది కనిపిస్తారు. నెహ్రూ మరణానంతరం మొరార్జీ పదవి కోసం ఎంతగానో ముచ్చటపడ్డారు. కానినిరాడంబరుడైన లాల్ బహుదూర్ శాస్త్రిని ఎంపిక చేశారు. ఆయన తర్వాత కూడా మొరార్జీని గాక పెద్దగా అనుభవం లేని ఇందిరాగాంధీని ఎంపిక చేశారు. 1977లో జనతాపార్టీ తరఫున 82 వ ఏట గాని మొరార్జీ ప్రధాని కాలేకపోయారు.అప్పుడు కూడా ఆయనతో పోటీపడిన జగ్జీవన్‌రాం, చరణ్‌సింగ్‌లు శక్తివంతులైనా జయప్రకాశ్ నారాయణ్, కృపలానీ వంటి పెద్దలు మొరార్జీనే ఎంపిక చేశారు. 1980లో ఇందిరాగాంధీ తిరిగి పదవి చేపట్టి హత్యకు గురైన తర్వాత ప్రణబ్‌ముఖర్జీ ముచ్చటపడ్డారు. కాని రాజీవ్‌నే పదవి వరించింది. 1989లో ఆయన ఓటమి తర్వాత వి.పి.సింగ్‌కే అవకాశం సహజంగా దక్కాల్సి వున్నా చంద్రశేఖర్ విఫలయత్నం చేసే తర్వాత దొడ్డిదోవన రాజీవ్‌గాంధీ సహాయంతో కీలుబొమ్మ ప్రధాని అయ్యాడు. 1991లతో రాజీవ్ హత్య తర్వాత శక్తివంతుడైన శరద్ పవార్ వంటి వారిని కాదని గృహోన్ముఖుడై మూటా ముల్లె సర్దుకుని కూచున్న పివినరసింహారావుకు పదవీ యోగం పట్టింది. 1996లో యునైటెడ్ ఫ్రంట్‌లోనూ బలవంతులైన ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్, మూపనార్ వంటి వారికి గాక ఎవరి దృష్టిలోనూ లేని దేవెగౌడను పీఠం వరించింది. ఆయనను సీతారాం కేసరి కూలగొట్టాకనైనా వీరిని గాక స్వంత పునాదిలేని గుజ్రాల్‌కు పట్టం కట్టారు. బిజెపిని అధికారం వైపు నడిపిన అద్వానీ గాక వాజ్‌పేయి సర్వాధీశుడైనాడు. 2004లో మన్మోహన్ సింగ్ కూడా అదే విధంగా అందలమెక్కాడు. తాత్కాలిక ప్రధానిగా రెండు సార్లు చేసిన గుల్జారీలాల్‌నందాను పక్కన పెడితే ప్రధానుల జాబితా- జవహర్‌లాల్ నెహ్రూ , లాల్ బహుదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్, చంద్రశేఖర్, పి.వి. నరసింహారావు, అటల్ బిహారీ వాజ్‌పేయ్, హెచ్.డి. దేవెగౌడ, ఇందర్ కుమార్ గుజ్రాల్, అటల్ బిహారీ వాజ్‌పేయ్, డా॥ మన్‌మోహన్ సింగ్.

కథ

దిద్దుకోలేని తప్పు

- చెన్నోజు రామన్

విశాఖపట్నంలో రామకృష్ణా బీచ్ చాలా కోలాహలంగా ఉంది. ఆరోజు ఆదివారం. వేసవి తాపం తట్టుకోలేక ముసలివాళ్ళు, పడుచువాళ్ళు, పిల్లలు బీచ్‌కి చేరారు. కేరింతలు కొడుతున్నారు. రాత్రి తొమ్మిదయినా ఎవ్వరూ ఇంటి ముఖం పట్టలేదు. కెరటాలు చాలా ఉద్ధృతంగా ఉన్నాయి. బహుశా పౌర్ణమి రాత్రి కావచ్చు! జనాన్ని చూసి అవి మరీ రెచ్చిపోయినట్లుగా ఉన్నాయి. అటువంటి వాతావరణంలోకి అప్పుడే అడుగు పెడుతూ.. హడావిడిగా... గాబరాగా.. ఆందోళనగా అటూ.. ఇటూ తల తిప్పి చూస్తూ... ఎవరికోసమో వెతుకుతూ... కొంచెం ఆయాసపడుతూ... నడుచుకుంటూ వస్తోంది సులోచన.

ఆవిడ అలా వెతుకుతూ... ఎవరికీ పట్టనట్టు ఏదో పోగొట్టుకున్నవాడిలా ... విచారంలో మునిగి దూరంగా కూర్చున్న చక్రపాణిగారిని చూసి దగ్గరకు వచ్చి కూర్చుందామె!

ఆయన ఆవిడ ముఖం కేసి చూసారు. ఆవిడను చూడగానే ఆయనకు ఎప్పటినుంచో అణిచిపెట్టుకొన్న దుఃఖం కట్టలు తెంచుకొని ఒక్కసారిగా బావురమన్నారాయన.

ఆవిడ కూడా కన్నీరు కారుస్తూ.. అలాగే ఉండిపోయింది చాలాసేపు! తరువాత ఆమే... కొద్దిగా తేరుకొని..

"చక్రీ!... ఏమిటిది? చిన్న పిల్లాడిలా."....అన్నది.

ఆయన ఏమీ అనలేదు.

అయినా ఆమెకీ చాలా బాధగానే ఉంది. జరిగిన విషయం తలుకుచుంటేనే ఏదోగా అనిపిస్తోంది. ఆ విషయమే...మాటి మాటికి గుర్తుకొస్తోంది. ఎంత మరుద్దామన్నా... మరువలేకపోతున్నది.

ఆ విషయమే సినిమా రీలులా గుర్తుకొస్తోంది.

చక్రికి భార్యలేదు.

ఒక కొడుకుని కని పురిట్లోనే పోయిందట! అప్పటి నుండి తల్లీ... తండ్రి... తనే అయ్యి వాడికి శ్రీధర్ అని పేరు పెట్టి పెంచి పెద్ద చేసాడు.

ఆ శ్రీధర్ పెద్దవాడయ్యి విదేశాల్లో ఉద్యోగం వెలగబెడుతూ... ఈరోజు ఉదయం రావడం.. వెళ్ళడం..కూడా జరిగింది.

ఆ వచ్చినవాడు తనని!.. చక్రిని ... నానా.. దుర్భాషలాడి.. అసహ్యించుకుని మరీ వెళ్ళాడు.

తనని ఎన్ని మాటలన్నాడో!? ఆమె కళ్ళ వెంబడి నీరు కారి చక్రి చేతి మీద పడ్డాయి.

చక్రి ఉలిక్కి పడ్డాడు. నెమ్మదిగా లేచి కూర్చొని "సులోచనా!?" అన్నాడు బాధగా ...

సులోచన కళ్ళు తుడుచుకొని "చక్రీ.. నాకేం బాధ లేదు. నిన్నూ... నీ పరిస్థితిని చూసి నేను బాధపడుతున్నాను. అతను కుర్రోడు కదా!? "నేనేం అనుకోవడం లేదు. గాని...నువ్వు ఇక్కడ నుంచి లే!... పదా... ఇంటికి వెళదాం..." అని అతణ్ణి పైకి లేవదీసింది... తను లేచి..

చక్రి ఏదో మాట్లాడబోయాడు.

"ఇప్పుడేం మాట్లాడకు చక్రీ!.." అని ఆమె వారించింది. ఇంటికి వచ్చిన తరువాత వారు ఎవరి రూముల్లోకి వారు వెళ్ళిపోయారు.

కాసేపటి తరువాత ఆమె చక్రి గది తలపు తట్టి

"చక్రీ !... భోజనం తెచ్చేదా!.." అని అడిగింది.

"నాకేమీ...వద్దు సులోచనా!.. ఏమీ తినాలని లేదు.. పళ్ళు ఏవో ఉన్నాయి. అవి తింటానులే!"

" ఇంకేమీ వద్దా!..." అని మళ్ళీ అడిగిందామె.

"సరే ఒక గ్లాసు పాలుంటే ఇవ్వు చాలు ..." అన్నాడాయన.

"అలాగే..."అని రూములోకొచ్చి కూర్చుందామె. నిజానికి ఆమెకు కూడా ఏమీ తినాలనిపించలేదు. మనసంతా బాధగా మూలుగుతోంది. తను తప్పు చేసినదానిలా మాటలు పడింది. మనసుకు ఎంత నచ్చ చెప్పుకున్నా.. కుదుటపడుటలేదు. కళ్ళు వర్షిస్తున్నాయి. ఏదో నిర్ణయానికి వచ్చిన దానిలా గబగబా లేచి ఒక గ్లాసు మంచి నీళ్ళు తాగి ఒక

కాగితం పెన్ను పట్టుకొని టేబుల్ దగ్గర కూర్చుందామె.

ఒక నిమిషం ఆలోచించి శ్రీధర్‌కి ఉత్తరం రాయడం మొదలుపెట్టింది.

"శ్రీధర్‌కు! నీకు ఏమీ కాని సులోచన అంటే ... ఓ పిచ్చిది దీవించి వ్రాయునది.. నీకు నా మీద ఎంత కోపమున్నా .. ఈ ఉత్తరం తప్పని సరిగా దయుంచి చదివి తరువాత చించి పారేయి."

"ఆర్నెల్లు కిందట నేనెవరో మీ నాన్నగారికి తెలియదు. ఆయనెవరో నాకు అంతకంటే తెలియదు. ఆయన మనస్సులో ఎప్పుడూ ఉండేది నువ్వే!? నీ గురించి చెప్పని, తలవని రోజంటూ ఉండదు. నువ్వే! ఆయనలోకం "

"నాకూ...ఈ లోకంలో నా అన్నవారెవ్వరూ.. లేరు. ఒకసారి రోడ్డు మీద నడిచి వెళుతూ.. కళ్ళు తిరిగి పడిపోయాను. అప్పుడు మీ నాన్నగారు అనుకోకుండా నా వెనకనే వస్తూ.. హాస్పిటల్‌లో జాయిన్ చేసారు మానవత్వంతో!...

ఆ రోజు నుంచే మేము స్నేహితుల్లా ఉంటున్నాము. ఒక మంచి మనసు ఎప్పుడూ ఇంకో మంచి మనసును కోరుకుంటుంది. ప్రతి మనిషికి ఒక మనసు ఉంటుందని ఇప్పుడే తెలిసింది. మీ ఇంట్లోనే ఒక పోర్షన్ ఖాళీ అయితే నేనే వచ్చి ఉన్నాను. అమ్మలక్కలు అంటే ఇరుగు పొరుగువారు మమ్మల్ని, మా మనసులను ఎన్ని తూట్లు పడేటట్లు మాట్లాడుతున్నా గుండెలు పగిలేటట్లు మాట్లాడుతున్నా.. మేము పట్టించుకోలేదు.

ఒక నెల క్రితం నుండి నీవు ఇండియా వస్తున్నావంటే ఆయనలో ఎంతో సంతోషాన్ని

టాక్సీ దిగిన శ్రీధర్ తమ వరండాలో దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. కొయ్యబారిపోయి నిలబడిపోయాడు.

సులోచన భౌతికకాయాన్ని పడుకోబెట్టి ఆమె తల వైపు దీపం పెట్టి మెడలో దండ వేసి ఉంచారు. సులోచన శవం దగ్గర కొద్దిమంది నిలుచుని ఉన్నారు. తన తండ్రి కూడా ... విచార వదనంతో ఆమె పక్కనే కూర్చొని ఉన్నారు. ఆయనలో ఏ భావమూ కనిపించడం లేదు. ముభావం తప్ప!

చూసాను. ఆ సంతోషాన్ని నేను కూడా అనుభవించాను. ఎందుకంటే నా జీవితమంతా చాలా చేదుగా.. బాధగా గడిచి.. ఎన్నో కష్టనష్టాలు భరించి అయినవారి చెంత చేరలేక జీవచ్ఛవంలా బతుకుతున్న నేను... నీ రాక కోసం సంతోషం అంటే ఏమిటో మొదటిసారిగా తెలుసుకున్న నేను... ఎంతో సంతోషంతో ఎదురు చూశాను. నీవు నన్ను ఒక తల్లిగానో.. అక్కగానో ఆదరిస్తావనుకున్నాను.

కానీ..నువ్వు రావడంతోనే మమ్మల్ని అపార్థం చేసుకొని అసహ్యించుకొని అనరాని మాటలని తిరిగి వెళ్ళిపోయావు! యాభై పైబడ్డ మా వయసులు కూడా నీ మనస్సుకు గాని, నీ కళ్ళకు గాని తెలియరాలేదు. మమ్మల్ని తప్పుగా అర్థం చేసుకొని మా మనస్సులను కాల్చిబూడిద చేసి వెళ్ళావు. చివరిగా ఒక్క విషయం గుర్తుంచుకో!?

నాకు క్యాన్సర్! గొంతు క్యాన్సర్. నా బతుకు ఎన్ని రోజులో!? ఎన్ని గంటలో? తెలియదు మంచితనమనే ఔషధాన్ని ఇచ్చి మీ నాన్న నా ఆయుష్షు పెంచాలని చూస్తున్నారు. ఇప్పుడు నాకూ.. బతకాలని ఉంది... కాని! నే నెప్పుడు ఎలా ఉంటానో నాకే తెలియదు.

చాలా మంది ఎదుట వాడి మంచితనాన్ని ఎదుగుదలను చూడలేరు. ఒక ఆడా ఒక మగ ... కలిసి ఉంటే చూడలేరు. తప్పుగా చూస్తారు. అదేతప్పు నీవూ చేశావు. అంతకంటే పెద్ద తప్పే చేశావు. నీవే మనిషివయితే మమ్మల్ని అర్థం చేసుకొని కలుషితమయిన నీ మనస్సును దిద్దుకో!.. ఎవరో ఏదో చెబితే అదే నమ్మావు. కంటికి రెప్ప కంటే ఎక్కువగా పెంచిన నీ తండ్రినే కాదన్నావు!! మా గురించి .. మా మనస్సుల గురించి నీకు ఏం తెలుసని! బాగా ఆలోచించుకో.. నేనేమైపోయినా... పర్వాలేదు. కనీసం నీ తండ్రినైనా జాగ్రత్తగా చూసుకో...

ఇట్లు నీకేమీ కాని
ఓ పిచ్చిది.

అని ఉత్తరం పూర్తీచేసి శ్రీధర్‌కు పోస్టు చేసింది.

ఆ ఉత్తరం అందుకున్న శ్రీధర్ "పళ్ళు పటపటమని కొరికాడు. చదవకూడదనుకొన్నాడు.

కాసేపటి తరువాత... స్థిమిత పడ్డాక నెమ్మదిగా ఆ ఉత్తరాన్ని ఆటూ.. ఇటూ.. తిప్పి చూసి.. విప్పి చదివాడు.

ఆ ఉత్తరం చదివిన తరువాత తల పట్టుకొని కుర్చీలో కూలబడ్డాడు. శ్రీధర్‌కు ఒక్కసారిగా వళ్ళంతా చెమటలు పట్టాయి.

"ఛ!" తను ఎంత తప్పు చేశాడు. చాలా.. అసహ్యంగా మాట్లాడి వచ్చాడు. మానవత్వం లేని మనిషిలా ప్రవర్తించాడు. కనిపెంచిన తండ్రినే అపార్థం చేసుకొన్నాడు.

ఇప్పుడెలా !

ఏం! చెయ్యాలి!!

కనీసం ఫోన్‌లో మాట్లాడినా ... ఆ తప్పు దిద్దుకోలేడు! వెళ్ళాలి! వెంటనే ఇండియా వెళ్ళాలి!!..." అనుకున్నాడు. ఇండియా వచ్చాడు శ్రీధర్ ...

టాక్సీ దిగిన శ్రీధర్ తమ వరండాలో దృశ్యాన్ని చూసి నిశ్చేష్టుడయ్యాడు. కొయ్యబారిపోయి నిలబడిపోయాడు.

సులోచన భౌతికకాయాన్ని పడుకోబెట్టి ఆమె తల వైపు దీపం పెట్టి మెడలో దండ వేసి ఉంచారు. సులోచన శవం దగ్గర కొద్దిమంది నిలుచుని ఉన్నారు. తన తండ్రి కూడా ... విచార వదనంతో ఆమె పక్కనే కూర్చొని ఉన్నారు. ఆయనలో ఏ భావమూ కనిపించడం లేదు. ముభావం తప్ప!

శ్రీధర్ తేరుకొని ఒక పరుగున వెళ్ళి సులోచన పాదాల పై పడి

"అమ్మా!! అని గావుకేక పెట్టాడు. బాధ అంటే ఏమిటో మనసుకు తెలిసివచ్చిన వాడిలా భోరున విలపించాడు. చాలా తప్పుగా అర్థం చేసుకొన్నానమ్మా... నన్ను క్షమించు!... నన్ను క్షమించకుండానే వెళ్ళిపోయావు!! నిన్ను నేనే చంపానమ్మా!! నేనే చంపానమ్మా!!.." అంటూ విలపించాడు.

సులోచనకు అంత్యక్రియలు జరిగిన తరువాత ఇంటికి వచ్చి వరండాలో ఉన్న పడక కుర్చీలో కూర్చున్నారు చక్రపాణిగారు. ఆయన శ్రీధర్‌తో "ఒక్క మాట కూడా మాట్లాడలేదు. *ఆయన పక్కనే కూర్చున్న శ్రీధర్ కాసేపటి తరువాత* "డాడీ!..." అని నెమ్మదిగా పిలిచాడు. ఆయన మాట్లాడలేదు. ఆయన పలుకక పోయినా శ్రీధర్ చెప్పడం ప్రారంభించాడు.

"డాడీ! ... నేను చాలా!.. చాలా!! .. తప్పు చేసాను. దిద్దుకోలేని తప్పు చేసాను.. ఎవరో చెప్పిన మాటలు విని మిమ్మల్ని చాలా బాధ పెట్టాను. మీరయినా నన్ను క్షమించండి డాడీ..!" ఆయన్ని కుదిపాడు శ్రీధర్.

కాని ఆయన పక్కకి వాలిపోయారు. శ్రీధర్ చెప్పింది విన్నారో!.. లేదో కూడా.. తెలియదు.

"డాడీ!..." అన్న శ్రీధర్ అరుపు మాత్రం వరండా అంతా ప్రతిధ్వనించింది.

★

"శ్రీధర్‌కు! నీకు ఏమీ కాని సులోచన అంటే ... ఓ పిచ్చిది దీవించి వ్రాయునది.. నీకు నా మీద ఎంత కోపమున్నా .. ఈ ఉత్తరం తప్పని సరిగా దయుంచి చదివి తరువాత చించి పారేయి."

"ఆర్నెల్లు కిందట నేనెవరో మీ నాన్నగారికి తెలియదు. ఆయనెవరో నాకు అంతకంటే తెలియదు. ఆయన మనస్సులో ఎప్పుడూ ఉండేది నువ్వే!?"

ముదురు

అదిరేటి డ్రస్సు నేనేస్తే...

ఏంటి అలా చూస్తున్నారు. మీరే కాదు మేమూ వేసుకుంటాం డ్రస్సులు.

అర్థం చేసుకోరూ...

ఈ పెద్దవాళ్ళున్నారు చూశావూ! పిల్లల్ని అర్థం చేసుకోడానికే ప్రయత్నించరు. లేకపోతే ఆ కర్రోడితో నీ పెళ్లి కుదర్చడమేంటి?!



కొబ్బరి పచ్చడి

కావలసిన వస్తువులు

కొబ్బరికాయ - 1
ఎండు మిర్చి - 10
ఉప్పు - సరిపడా
చింతపండు - చిన్న నిమ్మకాయంత
వెల్లుల్లి - 3 గర్భాలు
జీలకర్ర - టీ స్పూను
నూనె - చిన్న నేతిగిన్నెడు
పోపు సామాను , కరివేపాకు

తయారు చేయు విధానం

ముందుగా కొబ్బరికాయ కొట్టి తురుముకొని కానీ, చిన్న ముక్కలుగా కోసుకొని గానీ పక్కన పెట్టుకోవాలి. బాండీలో నూనె వేసి పొయ్యిమీద పెట్టి కాగిన తర్వాత ఎండు మిర్చి తొడిమలు తీసి వాటిని ఎర్రగా వచ్చేవరకు వేయించుకోవాలి. తర్వాత మిరప కాయలు తీసి అందులోనే పోపు సామాను, కరివేపాకు కూడా వేసి వేయించుకోవాలి. మిక్సీలోకానీ రోట్లోకానీ మిరపకాయలు మాత్రం వేసి నూరుకోవాలి. తర్వాత చింతపండు, వెల్లుల్లి, ఉప్పు, జీలకర్ర వేసి మెత్తగా నూరి అందులోనే కొబ్బరి కూడా వేసి మెత్తగా నూరుకొని తాలింపు పెట్టుకోవాలి. నోరూరించే కొబ్బరి చట్నీ రెడీ. వేడి వేడి అన్నంలో నాలుగు బొట్లు నెయ్యి జోడించి తింటే వుంటుందీ...సూపర్.

వంకాయ పచ్చడి

కావలసిన వస్తువులు

వంకాయలు - అర కిలో
పచ్చి మిరపకాయలు - 50 గ్రాములు
చింతపండు - నిమ్మకాయంత
అల్లం - అంగుళం ముక్క
జీలకర్ర - టీ స్పూను
వెల్లుల్లి - 4 గర్భాలు
ఉప్పు - సరిపడా
నూనె - 100 గ్రాములు
పోపు సామాను, కరివేపాకు

తయారు చేయు విధానం

వంకాయ ముక్కలను కోసి ఉప్పు నీళ్లలో వేయాలి. బాండీలో కొంచెం నూనె వేసి వంకాయ ముక్కల్ని వేయించి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నూనెలో పచ్చిమిరపకాయల్ని కూడా వేయించుకోవచ్చు. పచ్చి మిరపకాయల్ని వేయించే ముందు కొద్దిగా గాటు పెట్టి వేయిస్తే ఎగిరి మొహాన పడవు. పచ్చిమిర్చి, చింతపండు, జీలకర్ర, ఉప్పు, వెల్లుల్లి, అల్లం అన్నింటినీ రోట్లో వేసి నూరుకోవాలి. చివరలో వేయించి పెట్టుకున్న వంకాయ ముక్కల్ని వేసి నూరుకోవాలి. పోపులో కరివేపాకు వేసి దీనిలో కలుపుకుంటే సరి. ఇందులో పెద్ద ఉల్లిపాయ ముక్కల్ని కలిపితే కూడా బావుంటుంది. ఇష్టమైనవారు అలా చేయొచ్చు.



అరటికాయ పెరుగు పచ్చడి

కావలసిన వస్తువులు

అరటికాయలు - 2, పెరుగు - 1 కప్పు
పచ్చిమిర్చి - 6 (కారాన్ని బట్టి)
ఉప్పు - సరిపడా
చింతపండు - గోలీ కాయంత
పోపుసామాను, కరివేపాకు

తయారు చేయు విధానం

ముందుగా అరటికాయను పెద్ద ముక్కలుగా కోసి ఉడకబెట్టుకోవాలి. పచ్చిమిర్చి వేయించుకోవాలి. పచ్చిమిర్చి, చింతపండు, ఉప్పు కలిపి మెత్తగా నూరుకుని ఉడకబెట్టిన అరటికాయ ముక్కల్ని కూడా కలిపి నూరుకోవాలి. అందులో పెరుగును కలిపి పోపు పెట్టుకోవాలి. (అరటికాయ ఉడికిన తర్వాత పై తొక్కు ఇష్టమైతే ఉంచుకోవచ్చు లేకపోతే తీసేయొచ్చు).

కాల్చిన దోసకాయ పచ్చడి

కావలసిన వస్తువులు

దోసకాయ - పావుకిలో, చింతపండు - కొంచెం
పచ్చిమిరపకాయలు - కారానికి సరిపడా
జీలకర్ర - టీ స్పూను, ఉప్పు - తగినంత
వెల్లుల్లి - 3 గర్భాలు, నూనె - చిన్న గరిటెడు
పోపు సామాను, కరివేపాకు

తయారు చేసే విధానం

దోసకాయను పొయ్యిమీద పెట్టి కాల్చాలి. పైన మాడినట్టున్న తొక్కను తీసివేయాలి. పచ్చిమిరపకాయల్ని వేయించి పెట్టుకోవాలి. పచ్చిమిరపకాయలు, చింతపండు, వెల్లుల్లి, జీలకర్ర వేసి మెత్తగా నూరి అందులో కాల్చి పెట్టుకున్న దోసకాయను కూడా వేసి నూరుకొని పోపు పెట్టుకోవాలి. వేడన్నంలో నెయ్యి వేసుకుని పచ్చడి కలుపుకుంటే భలేగా వుంటుంది.



సినిమా కబుర్లు



కనపడని రెక్కలతో...

"నింగి నేల నాదే" ఎంత చక్కటి భావన. ఎంతటి ఆత్మ విశ్వాసముంటే అలా అనగలరు! వినడానికే ఇలా వుందే. ఇంక సినిమా చూస్తే... ఎలా వుంటుందో కదా. వాస్తవానికి ఇది 'ఇన్విజిబుల్ వింగ్స్' చిత్రానికి తెలుగు అనువాదం. లీ క్వింగ్యావో అనే అవిటి అమ్మాయి జీవితం చుట్టూ తిరిగే కథ ఇది. అయితే ఇది ఆ అమ్మాయి నిజజీవిత కథేనంటే నమ్మబుద్ధి కాదు గబుక్కున. అసలు లీ కి చేతులు ఎందుకు పోయాయి? తర్వాత ఆ వైకల్యాన్ని, ఆటంకాన్ని ఎలా అధిగమించింది? తనను చూసినవారి నోటివెంట అప్రయత్నంగా 'భైరా' అని ఎలా అనిపించింది? వంటి విషయాలు ఈ వారం మీకోసం...

లీ క్వింగ్యావో చక్కటి నటి. అలాగని ఆమె చాలా సీనియర్ నటి అనుకోకండి. బాల నటి. అనుకోకుండా చిత్రసీమలోకి అడుగెట్టింది. ఆమె వైకల్యమే అందుకు దోహదపడింది.

అసలు తనకు చేతులు ఎందుకు పోయాయో తెలియాలంటే... చాలా ఏళ్ల వెనక్కి వెళ్లాలి. అప్పుడు తనకు సరిగ్గా నాలుగేళ్లు. స్నేహితులతో కలిసి సంతోషంగా గాలిపటాలు ఎగరేస్తోంది చిన్నారి లీ. అకస్మాత్తుగా ఒక గాలిపటం కరెంటు వైరుకు చుట్టుకుంది. చురుకైన చిన్నారి లీ దాన్ని విడిపించడం కోసం పైకి ఎక్కింది. అలా ఎక్కడం చాలా ప్రమాదమని ఆ సమయంలో తనకు తెలీదు. వైరుని పట్టుకుంది. అంతే... షాక్ కొట్టి దభీమని కిందపడిపోయింది.

వారం రోజుల తర్వాత లీ కళ్లు తెరిచింది. కానీ ఆమెకు చేతులు లేవు. అప్పుడు ఆ చిన్నారి తల్లిని ఇలా అడిగింది.

"అమ్మా...పక్షులకు రెక్కలున్నాయి. మరి నా చేతులేవి?' అని.

"తల్లీ నీకు కనిపించని రెక్కలున్నాయి. నువ్వు పెద్దయ్యాక అవి నీకు కనిపిస్తాయి" అని చెప్పిందామె అనునయంగా.

ఆ రోజుల్లో తల్లిదండ్రుల సాయం లేకుండా లీ కనీసం కూర్చోగలిగేది కాదు. పైగా కాళ్లతో రాయాల్సి రావడం ఆమెకు చాలా కష్టంగా వుండేది. అప్పుడు తండ్రి "నాకు నమ్మకముంది తల్లీ. నువ్వు సాధిస్తావు" అని భుజం తట్టేవాడు. తల్లిదండ్రులిచ్చిన ప్రోత్సాహంతో ఆటంకాలను అధిగమించడం నేర్చుకుంది. కసిగా ముందుకు నడవడం అలవరచుకుంది. అయితే అది చెప్పుకున్నంత సులభం కాదు. అందుకు కొన్ని సంవత్సరాల కఠిన శిక్షణ, పట్టుదల, ఓర్పు చూపెట్టింది లీ. పాదాలతోనే బ్రష్ పట్టుకొని పళ్లు తోముకోవడం...అన్నం తినడం...అంతేనా ద్విచక్రవాహనాన్ని ఇట్టే నడపడం నేర్చుకుంది. పదకొండేళ్ల వయసులోనే లీ బట్టలు కుట్టడం కూడా నేర్చేసుకుంది.

చివరికి లీ ఒక్క విషయం తెలుసుకుంది. అదే తనకు నాలుగేళ్లప్పుడు అమ్మ చెప్పింది కదా. తనకు కనబడని రెక్కలున్నాయని. వాటిని తను చూడగలిగింది. అయితే మరింత కష్టపడితే వాటి సాయంతో ఎగరాలన్న కల నిజం చేసుకోవచ్చనుకుంది. అనుకోవడమే కాదు కలను నిజం చేసుకుంది కూడా.

అంతేనా తనకు పద్నాలుగేళ్ల వయసులో సిచువాన్ స్పోర్ట్స్ టీమ్‌కు ఎంపికైంది. లీకి పెద్దగా శిక్షణ ఇవ్వవలసిన అవసరం లేకపోయింది. హై జంప్, లాంగ్ జంప్‌లో చక్కగా తన ప్రతిభను కనబరిచింది. క్రమం తప్పకుండా టీమ్‌లో కొనసాగడం లీకి కష్టమే అయినా చక్కగా కొనసాగింది. శిక్షణ పూర్తిచేసింది. ఇచ్చిన సమయాన్ని, సందర్భాన్ని ఉపయోగించుకుంటే చక్కటి ప్రతిభను కనబరచవచ్చని నేర్చుకుంది.

మరి లీ జీవితాన్ని సినిమాగా తీయాలని ఎవరికి ఎప్పుడు అనిపించింది? 2005లో ఫెంగ్ ఝెన్‌ఝి కి లీ గురించి తెలిసి కదిలిపోయాడు. అతను, అతని భార్య కలిసి లీ జీవితాన్ని చిత్రంగా మలచాలనుకున్నారు. ఫెంగ్, అతని భార్యతో మాట్లాడాక లీ కూడా అందుకు అంగీకరించిది. అందుకు పూర్తిగా సహకరిస్తానని కూడా చెప్పింది. అదే సంవత్సరాంతంలో తన జీవితాన్ని కథగా పెట్టి తీస్తున్న చిత్రంలో (ఇన్విజిబుల్ వింగ్స్) నటించడానికి లీ అంగీకరించింది. నీళ్లంటే భయపడే లీ సినిమా కోసం ఈత కూడా నేర్చుకుంది. నటించేటప్పుడు లీ కార్చిన కన్నీళ్లన్నీ నిజమైనవే. అయితే వెండితెరపై కనిపించి లీ ఎందరికో కంటతడి పెట్టించింది. ఎన్నో అంతర్జాతీయ అవార్డులను సొంతం చేసుకొంది. అంతేనా అద్భుత బాల నటిగా కూడా అవార్డు అందుకుంది లీ.

ఆ అద్భుత చిత్రానికి తెలుగు రూపమే 'నింగి నేల నాదే'. ★

కూల్‌కూల్‌గా...

కూల్‌డ్రింకులు



ఎండాకాలం దాదాపు చివరికొచ్చేసింది. మూడు నెలలపాటు మున్నెన్నడూ లేని విధంగా తీవ్రమైన ఎండలతో మనలను ఠారెత్తించిన వేసవికాలం సెలవు తీసుకోబోతోంది. ఎండాకాలంలో మాత్రమే మనకి ఉపయోగపడే లేదా మనం వినియోగించే కొన్ని ఆహారపదార్థాలూ, వస్తువులూ, ఉపకరణాల గురించి వారం వారం తెలుసుకుంటూ వస్తున్నాం. ఇక ఇప్పుడు మనం వేసవిలో ఎక్కువగా తాగడానికి ఎక్కువగా ఇష్టపడే డ్రింకుల గురించి తెలుసుకుందాం - అవే కూల్‌డ్రింకులు.

- డా॥ విజయ్

మనిషికి మంచినీరు అత్యవసరం. నీరు లేనిదే జీవం లేదు. ఎండాకాలంలో మరీ అవసరం. వేడికి శరీరం కూడా వేడెక్కుతుంది. కానీ శరీరం ఎక్కువ ఉష్ణోగ్రతలో సరిగా పనిచేయదు. అందువల్ల వేడిని తగ్గించడానికి శరీరం చెమటని ఉత్పత్తి చేస్తుంది. చర్మం పైనుండి ఆవిరౌతున్న చెమట తనతో పాటు వేడిని తీసుకుపోయి, మనలను చల్లబరుస్తుంది. ఆ విధంగా శరీరం నుండి నీరు, నీటితో పాటు లవణాలు బయటకు పోతాయి. శరీరం చల్లబడుతుంది. బాగానే వుంది కానీ, మరి నీరు మళ్లీ శరీరంలోకి చేరాలి కదా. అలా కానిపక్షంలో 'డీహైడ్రేషన్' జరిగి ప్రమాదం ముంచుకొస్తుంది. అందువల్ల నీరు ఎంత ఎక్కువ తాగితే అంత మంచిది. కానీ ఒట్టి నీళ్లు తాగడం కంటే శరీరానికి మేలు (మరింత) చేసేది తాగితే?

మజ్జిగ మజా

అటువంటి అద్భుత పానీయాన్ని మనవాళ్లు కనిపెట్టారు. దాని పేరు మజ్జిగ. పాలు, పెరుగులోని సుగుణాలతో పాటు శరీరానికి చలువ చేసే గుణమూ ఉండడం వలన మజ్జిగ అన్ని కాలాల్లోనూ... ప్రత్యేకంగా వేసవిలో చాలా శ్రేష్ఠమైనది.

మజ్జిగలో వెన్న తీసేస్తే మరింత మంచిది. దాహం తీరడంతో పాటు పొటాషియం, కాల్షియం, రైబోఫ్లేవిన్, ఫాస్ఫరస్, విటమిన్ బి12 వంటి పోషకాలూ లభిస్తాయి. పూర్వకాలంలో వెన్న తీయగా మిగిలిన ద్రవాన్ని పారబోయకుండా వుంచితే అది పులిసి (బ్యాక్టీరియా వల్ల) ఒక రకమైన పులుపు కలిసిన రుచి వస్తుందని తెలుసుకున్నారేమో. అలా అలా మజ్జిగ వాడకంలోకి వచ్చింది.

ఇప్పుడైతే మజ్జిగలో ఉప్పు లేదా పంచదార కాకపోతే రంగు వగైరాలు దట్టించి లస్సీ అనో, ఫాలూదా అనో వాడుతున్నారు కానీ, కాస్త పల్చని మజ్జిగలో నిమ్మకాయ పిండి, చిటికెడు ఉప్పు చిలకరించి తిరగబోసి తాగితే ఎంతటి ఎండైనా ఠండా అవ్వాల్సిందే. ఎంతటి వేడైనా ఓడిపోవాల్సిందే.

గోలీ సోడా

ఈ నాటి కుర్రకారుకి మజ్జిగ కంటే కూల్‌డ్రింకులు మేలనిపిస్తాయి. సీసాలో మూత తీయగానే బుస్సుమని నురగ పొంగుకొచ్చే రంగునీళ్లు మన వాళ్లను ఇట్టే ఆకర్షిస్తాయి. ఒకనాడు 'గోలీ'సోడాలని వచ్చేవి. ఎండలకు రుచీ పచీ లేని చప్పిడి సోడాలే గొప్ప సేద అనుకునేవాళ్లు. ఆ తరువాత్తరువాత





కోలాలూ, వగైరాలు రంగ ప్రవేశం చేశాయి.

మామూలు నీళ్లకంటే అలా 'బుడగ'లొచ్చే నీళ్లు పూర్వం ఆరోగ్యానికి గుర్తనుకునేవాళ్లు(ఇప్పుడు సీసాలో సీల్ చేసిన 'మినరల్‌వాటరే బెటరనుకుంటున్నట్టు).

సహజంగా బుడగలు వచ్చే కొలనుల్లో స్నానం చేస్తే రోగాలు మాయమౌతాయన్న నమ్మకం పెరిగిపోయింది. ఆ తరువాత శాస్త్రం నీళ్ల బుడగలు వెదజల్లడానికి కారణం కార్బన్ డయాక్సైడ్ వాయువు అని వివరించింది. ఇక ఆ తరువాత నీటిలో కార్బన్ డయాక్సైడ్ కలిపి అమ్మడం ఊపందుకుంది.

కూల్‌డ్రింకు కత

పదిహేడవ శతాబ్దంలో మొదటి 'కూల్‌డ్రింకు' వాడకంలో ఉన్నట్టు తెలుస్తోంది. నీరు, నిమ్మరసం, కాస్త తేనె కలిపిన డ్రింకుని అప్పట్లో అమ్మేవాళ్లు. కానీ వీటిలో కార్బన్ డయాక్సైడ్ వాయువుని నింపేవాళ్లు కాదు. పారిస్‌లో 1676లో నిమ్మరసం అమ్మకాలు విపరీతంగా ఉండేవి.

జోసఫ్ ప్రీస్ట్‌లీ అనే ఆంగ్ల శాస్త్రవేత్త 1767లో కార్బన్‌డయాక్సైడ్ వాటర్ (కార్బన్‌డయాక్సైడ్ కలిపిన నీరు) ని సృష్టించాడు. ఆ తరువాత కొంతమంది ఆదిశలో ఎన్నో ప్రయత్నాలు చేసినా, 1832 వరకూ అవి ప్రజాదరణ పొందలేదు. ఆ సంవత్సరంలో అమెరికాకు చెందిన జాన్ మాథ్యూస్ అనే వ్యక్తి కార్బొనేటెడ్ వాటర్‌ని చేసే యంత్రాన్ని రూపొందించాడు.

ఇక 1886 సాఫ్ట్‌డ్రింకుల చరిత్రలో గొప్ప సంవత్సరం. ఆ ఏడే కోకాకోలా రూపొందించి, అందుబాటులోకి వచ్చింది. కానీ విచిత్రమేమిటంటే అప్పట్లో కోకాకోలా ఒక తలనొప్పి మందుగా మందుల షాపుల్లోనే లభించేది. అలాగే 1903లో పెప్సీ-కోలా కడుపులో మంటను తగ్గించే మందులా మార్కెట్లోకి వచ్చింది!

కానీ కాలక్రమేణా వందలాది రకాల సాఫ్ట్ డ్రింకులు మార్కెట్‌ని ముంచెత్తాయి. ఎన్నో తరాల పాటు మనమూ వాటిలో మునిగిపోయాం.

నిజానికి కార్బన్‌డయాక్సైడ్ కలిపిన నీరు (సోడా) మనకి ప్రత్యేకంగా చేసే మేలేమీ లేదు - కాస్తో కూస్తో హాని తప్ప. ముఖ్యంగా మన దాహాన్ని అవి తీర్చవు. మనకి చలువ చేయవు. పైగా, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి సమస్యలను తెచ్చిపెడతాయి. కార్బన్‌డయాక్సైడ్ నీటితో కలిసి కార్బానిక్ ఆమ్లంగా మారుతుంది. అటువంటి ఆమ్లాన్ని తాగమంటే ఎవరూ తాగరు. కానీ, కూల్‌డ్రింకుల నిండా వుండేది (కార్బొనేటెడ్) అదే ఆమ్లం!

కాబట్టి ఈ వెళ్లిపోయే వేసవిలోనూ, మరే రోజుల్లో అయినా కూల్‌డ్రింకుల జోలికి పోకుండా కంట్రోల్ చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా చిన్నపిల్లల్ని వాటికి దూరంగా ఉంచండి. నిమ్మరసం, పండ్లరసం (తాజావి), మజ్జిగ వంటివి ఒంటికి మంచిది.

హ్యాపీగా మజ్జిగ గ్లాసుతో ఎండలకు గుడ్‌బై చెప్పేద్దాం. ★



నృత్య పరిశోధనలమయం



నటరాజ రామకృష్ణ గారి పేరు ఆంధ్రప్రదేశ్‌లో నృత్యం అనే విషయానికి ఎంత ఆత్మీయమైన అంశమో ప్రత్యేకంగా నమోదు చేయాల్సిన అవసరం లేదు. అది నృత్యానికి నాట్యాచార్యునికి ప్రత్యేకమైన గుర్తింపు ముద్ర లాంటిదే. దేవదాసీల బతుకు లోతుల్లోకి పోయి వారి జీవితాలను కూలంకషంగా అర్థం చేసుకున్న అరుదైన వ్యక్తిత్వం రామకృష్ణ గారిది. సాంప్రదాయ బద్ధంగా ఉండే పండిత కుటుంబం మనిషి కాదు ఆయన. కళాకారుల చేత నాట్యం చేయించి ఆనందించే జమిందారీ వ్యవస్థ నుండి వచ్చిన మనిషి. బహుముఖ ప్రజ్ఞాశాలి. నాట్యశాస్త్రం గురించి ఆసక్తి కలిగించిన అన్న శ్యామ సుందర్, గురువు కాళహస్తి రాజమ్మ, ఆధ్యాత్మిక రామాయణ సంకీర్తలను పాడుతూ అభినయించగల నాట్య తపస్విని సరిదె మాణిక్యమ్మ బులి వెంకట రత్నమ్మ, మండపాటి మాణిక్యం ఆయన జీవితంలో మరచిపోలేని వ్యక్తులు. నటరాజ రామకృష్ణ నాట్యం తీరు తెన్నులను, అభినయం, చేసే పద్ధతిని ప్రేక్షకులకు వివరించి చెప్పేవారు. పాటల్లోని అర్థాన్ని ప్రేక్షకుల మనస్సు దోచుకునేలా గానం చేస్తూ, అభినయించేవారు. తెలుగు భాష సొగసును, కమ్మదనాన్ని, మాధుర్యాన్ని రమ్యంగా అందించారు. నటరాజ బిరుదాన్ని అందించిన పెద్దవారు భండార సంస్థానాధిపతి రాజా గణపతిరావు. అదీ ఆయన 18 సంవత్సరాల వయస్సులోనే పొందడం గమనించాలి. ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక అకాడమీ వారి 'భారత కళా ప్రపూర్ణ' , కేంద్ర సంగీత నాటక అకాడమీ ద్వారా దక్షిణ భారత ఉత్తమ నాట్యాచార్యుడిగా ఎంపిక, శ్రీశైల దేవస్థానం 'ఆస్థాన నాట్యాచార్యుడి'తో పాటు 'ఆంధ్రప్రదేశ్ ఆస్థాన నాట్యాచార్యుడి'గా నియామకం, రాజ్యలక్ష్మీ అవార్డ్, రాజీవ్ గాంధీ ఫౌండేషన్ అవార్డ్, 'డి-లిట్'తో పాటు లెక్కలేని బిరుదులు, సత్కారాలు వరించాయి. ప్రపంచం నలుమూలల్లో 'భారతీయ నృత్య పరంపర' వ్యాపించేలా జీవితాన్ని నాట్యశాస్త్రం కోసం ధారపోసిన రుషితుల్యుడి పరిచయం నటరాజ రామకృష్ణ.

మన నృత్య సాంప్రదాయం ఎంతో అద్భుతమైనది. శివతాండవం, ఆలయ నృత్యాలు, కేళికలు, ప్రచార నృత్యం, జానపద నృత్యం, ఆటవికుల నృత్యం... లాంటి నృత్య ప్రక్రియలను కూలంకషంగా అభ్యసించారు రామకృష్ణగారు. అంతటితో ఆగలేదు. ఆది శంకరుల ఏడు రకాల తాండవాల మర్మాలనూ, అందాన్ని అర్థం చేసుకుని పుస్తకాలను రచించారు. ఆనంద తాండవం, సంధ్యా తాండవం, కలిక తాండవం, విజయ తాండవం, ఊర్ధ్వ తాండవం, ఉమా తాండవం, సంహార తాండవం గురించి సవివరణాత్మక రచనలు ఆయన ప్రత్యేకతలే. మహారాష్ట్రలో లావణీ, దందోరా, తమాషా, పొవాడా చాలా ప్రచురితమైన నృత్య పద్ధతులు. అయితే వాటిమీద హిందుస్థానీ, కథక్ నృత్యాల ప్రభావం అధికం. ప్రకృతి ఆరాధనలో గోండుల ఖర్మ నృత్యం, చుళిత/ చేళిక నృత్యం వివరణలిచ్చిన మహా నృత్య తపస్వి నటరాజ రామకృష్ణ. భారతీయ నృత్య కళ అద్వితీయమైనది. ఆరు విధాలైన నృత్య ప్రక్రియలున్నాయి. తమిళనాడులోని భరతనాట్యం - దాసి అట్టం, ఆంధ్రప్రదేశ్‌లోని కూచిపూడి నృత్యం - భోగమాట, ఉత్తరప్రదేశ్ వారి కథక్, బెంగాల్, మణిపూర్ వారి మణిపూరి, మలబార్ ప్రాంతపు కథాకళి, మోహినీ అట్టం, సిరైకేళాలోని చౌ నృత్యం... అన్నీ ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను, సుగంధంలా వ్యాపింపచేస్తాయి. పేరణీ - నవ జనార్ధనము మన ప్రత్యేకతలు. మరుగున పడిపోయి మగ్గిపోతున్న పేద కళాకారుల ప్రాచీన వైభవాన్ని తిరిగి ఆపాదించే కృషి చేసిన నటరాజ రామకృష్ణ - దొమ్మరి ఆటలు, వీధి నాటకాలు, తోలు బొమ్మలాటలు, తూర్పు భాగవతం, చిందు భాగవతం వంటి నృత్యాలమీద పరిశోధనలు చేసి వాటి అభివృద్ధికి శ్రమించారు. విజయం సాధించారు. ఆ విజయాల పరంపరల విచిత్ర విశ్వం 228 పేజీల్లో నిక్షిప్తమై ఉంది. ఓపికతో ఆస్వాదించడం, ఆనందించడం, గర్వించడం మన పని. కావలసిందల్లా ప్రగాఢమైన, బలీయమైన పఠనాశక్తి! అంతే ! రచయిత్రులు అభినందనీయులు.

- డా॥ జె.పి.వైద్య

"నటరాజ రామకృష్ణ"
రచన: వకుళాభరణం లలిత, కాశీ సువర్చలా దేవి,
వకుళాభరణం రామకృష్ణ
పేజీలు : 228, వెల : 100/-, ప్రతులకు : ఎమెస్కో బుక్స్

కొత్త పుస్తకాలు

బడుగు జీవుల ఇక్కట్లకు అక్షరరూపం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి పాక్షిక ఆర్థిక సహాయంతో ఈ కథల సంపుటిని ముద్రించారు. శ్రీ వెంకటేశ్వర స్వామికి అంకితం ఇచ్చారు కవి అంబల్ల జనార్ధన్. ప్రఖ్యాత కథా రచయిత, విమర్శకులు, కవి, విహారి, నవలా రచయిత సలీం ఈ కథా సంపుటికి ముందు మాటలు రాశారు. దాదాపు 150 పేజీల్లో 21 కథల్ని కవి అంబల్ల అందించారు. నేను తాతనయ్యానోచ్, స్థిత ప్రజ్ఞత, ఆపద్బాంధవి, బొమ్మ వెనుక, బర్కతు, భద్రత, ఆక్రందన, పుట్టింటి పట్టుచీర, కొత్త నీరు, చెదిరిన గూడు, దొరకునా ఇటువంటి సేవ, నష్టపరిహారం, అనురాగ సంగమం, మరో తాబేలు, కుందేలు - విరామం - నేలమీద సాగు - పరాయీకరణీయం, విచిత్ర గుప్తీయం, నా కథకు బహుమతి వచ్చిందండోయ్, తూర్పు పడమరైతే... లాంటి కథలున్నాయి. ఉత్తర తెలంగాణా మాండలికంతో, మట్టివాసనల్తో ఈ కథలు మాసాన్యుని గుండె చప్పుళ్ళుగా ధ్వనిస్తాయి. కుటుంబ అనుబంధాలు, మానవ సంబంధాలు, మైత్రి సామాజికాంశాలు... శ్రామికుల కష్టసుఖాలు.. అంతస్సూత్రంగా అగుపిస్తాయి.

పరాయి కరణీయం (పేజీ135) కథ చాలా బాగుంది. ప్రపంచీకరణ, సరళీకరణ నేపథ్యాన్ని బహుళ జాతి సంస్థల దోపిడిని చక్కగా రాశారు. ఔట్ సోర్సింగ్ ముసుగులో యజమానులు చేసే శ్రమ దోపిడీని చక్కగా కథలో చెప్పారు. మూడు తరాల్ని చక్కగా చూపారు. పాపయ్య, అంజయ్య, సూరి పాత్రల్లో శ్రామికులు ముఖ్యంగా అసంఘటిత కార్మిక వర్గ గుండె చప్పుళ్ళ వినిపింపచేశారు.

చక్కటి మాండలిక భాషతో 'బర్కతు' కథ సాగుతుంది (పేజీ 48). విపుల పత్రికలో అచ్చయిన టైటిల్ కథ 'బొమ్మ వెనుక' చాలా అసహజంగా అనిపిస్తుంది. వాస్తవంలో నూటికి 98 మంది అమెరికాలో భర్తల అఘాయిత్యాలకు, ఆరళ్లకు ఆహుతైన వారే! వార్తలు అవే అంశాలను రూఢి చేస్తున్నాయి. కానీ ఈ కథలో సాగర్‌ను వేధించి, డబ్బు కోసం మరో పెళ్లిని చేసుకున్న పాత్రగా రజనిని చూపారు. రజని లాంటి స్త్రీలు సమాజంలో ఒకళ్లిద్దరు వుంటే, 98 మంది భార్యను కాల్చుకుతినే భర్తలే ఎక్కువ. ముఖ్యంగా ఎన్.ఆర్.ఐ అల్లుళ్ల ఆగడాలు చూస్తూనే ఉన్నాం కదా! ఈ కథ నిరాశపర్చింది. ఆపద్బాంధవి కథ సమాజంలో విడాకుల దాకా వెళ్లే జంటలకు చక్కటి పరిష్కారిలా నిలుస్తుంది. సుమిత పాత్రను చక్కగా మల్చారు. స్త్రీ స్వశక్తితో నిలబడేలా చిత్రీకరించారు. కోర్టులో విడాకుల దాకా వచ్చినా మళ్లీ భర్తతో కలిసిన తీరు బాగుంది. వలస బతుకుల వ్యథలు, బడుగు జీవుల ఇక్కట్లు, వాస్తవ పరిస్థితుల్ని కథానికలుగా అక్షరీకరించిన అంబల్ల జనార్ధన్ అభినందనీయులు. సామాజిక స్పృహతో మరిన్ని కథలు వీరి కలంనుంచి రావాలి.



- తంగిరాల చక్రవర్తి

"బొమ్మ వెనుక మరికొన్ని కథలు"
రచన: అంబల్ల జానార్ధన్, పేజీలు: 164, వెల: 100/-,
ప్రతులకు : విశాలాంధ్ర, నవోదయ, శ్రీసరస్వతి బుక్ డిపో (ముంబాయి)
మరియు
శ్రీమతి అంబల్ల సువర్ణ
బి. 204, ధీరజ్ కిరణ్, 2వ ఫ్లోర్, ముంబాయి-400064.



క్యాట్ ఉమెన్

ప్రతి మనిషికీ కోరికలుంటాయ్. కానీ తీరడం కష్టం అందరికీ. ఇక్కడ రకరకాల ఫోజులిచ్చినావిడ జోసిలిన్ వైల్డెస్టిన్. మాంచి ధనవంతురాలు. మొదట్లో అమాయకంగా చూడ చక్కగా వుండేది. తర్వాత క్యాట్ ఉమెన్‌గా మారాలనిపించిందామెకు. అంతే లెక్కలేనన్ని సార్లు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సర్జరీలు చేయించుకుంది. దాంతో ఇలా తయారైంది. అందుకేనేమో పుర్రెకో బుద్ధి జిహ్వాకో రుచి అన్నారు పెద్దలు.

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకు కూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్‌ఫోటోను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్ కలంస్నేహం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్.

పేరు కె. రష్మి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జవహర్‌లాల్ నవోదయ హై స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: డ్రాయింగ్ వేయడం, కథలు చదవటం
చిరునామా: కె. రష్మి
డాటరాఫ్ కె. రవి కుమార్,
ఒంగోలు, ప్రకాశం.

పేరు: చలపాక నాగసాయి అలేఖ్య
చదువు: 2వ తరగతి
వయస్సు: 9 సం॥
స్కూల్ : గ్రేట్ నాలెడ్జ్ పబ్లిక్ స్కూల్
లక్ష్యం: డాన్సర్ కావడం
హాబీలు: కొత్త విషయాలు తెలుసుకోవడం
చిరునామా: చలపాక నాగసాయి అలేఖ్య
డాటరాఫ్ సిహెచ్.యం.కె.ఎస్.చలం,
ఇం.నెం.6-25,
దుగ్గిరాల, గుంటూరు.

పేరు: కోట రవి ప్రసాద్ రెడ్డి
చదువు: 9వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూల్: నలంద హైస్కూల్
లక్ష్యం : ఐపిఎస్ కావడం
హాబీలు: పాడడం, సమాజసేవ, ఆడుకోవడం
చిరునామా: కోట రవి ప్రసాద్ రెడ్డి
సన్నాఫ్ కోట రమణారెడ్డి,
వై. పాలెం, ప్రకాశం.

పేరు: మినహాజీ అహ్మద్
చదువు: 8వ తరగతి
వయస్సు: 13 సం॥
స్కూలు: ఎం.వి. రామన్ హైస్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: న్యూస్ చదవడం, క్రికెట్ ఆడడం
చిరునామా: మినహాజీ అహ్మద్
సన్నాఫ్ నజీర్ అహ్మద్(టీచర్)
శిశు మందిర్ దగ్గర, ఆత్మకూర్,
మహబూబ్ నగర్.

పేరు: సి. రమేష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూల్: జడ్.పి.హెచ్ స్కూల్
లక్ష్యం : ఇంజనీర్ కావడం
హాబీలు: పుస్తక పఠనం, క్రికెట్ ఆడడం
చిరునామా: సి. రమేష్
సన్నాఫ్ నరసింహులు, దొంగల్లు రోడ్,
ముదిగుబ్బ, అనంతపూర్.

పేరు: బి. సాయి నిఖిల్
చదువు: 4వ తరగతి
వయస్సు: 9 సం॥
స్కూలు: గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్
లక్ష్యం : ఇంజనీర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, పుస్తకాలు చదవటం,
చిరునామా: బి. సాయి నిఖిల్
సన్నాఫ్ సత్యనారాయణ,
పాలకొండ, శ్రీకాకుళం.

పేరు: రావిపాటి సుబ్బానాయుడు
చదువు: 9వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు : బి.వి.ఎస్. హైస్కూల్
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: డాన్స్ చేయడం, క్రికెట్ ఆడడం
చిరునామా: రావిపాటి సుబ్బానాయుడు
సన్నాఫ్ మోహన్ రావు, లింగరాజు అగ్రహారం,
జలదంకి, నెల్లూరు.

పేరు: ఎమ్. భరత్ కుమార్
చదువు: 9వ తరగతి
వయస్సు: 14 సం॥
స్కూలు : త్రివేణి టాలెంట్ స్కూల్
లక్ష్యం: శాస్త్రవేత్త కావడం
హాబీలు: ప్రయోగాలు చేయడం
చిరునామా: ఎమ్. భరత్ కుమార్
సన్నాఫ్ కృష్ణారావు, ద్వారకా నగర్, ఖమ్మం.